





నేడు అన్నదాత సుఖీభవ



నిడదవోలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకానికి గ్రీన్ సిగ్నల్ పడింది. రైతుల ఖాతాల్లో శనివారం నుంచి సొమ్ములు జమవుతాయని మంత్రి కం దుల దుర్గేష్ ప్రకటించారు.ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన రైతన్నల ఖాతాల్లో పెట్టుబడి సాయం తొలి విడతగా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ 2 వేలు మొత్తం రూ.7 వేలు ఒక్కో రైతు ఖాతాలో జమ వు తుందన్నారు.మూడు విడతల్లో రూ.20 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తారన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.14 వేలు, కేంద్రం వాటా రూ.6 వేలు అన్నారు. ఒక వేళ అర్హులై ఉండి నగదు జమకాని రైతులు ఎవరైనా ఉంటే ఆందోళన అవసరం లేదన్నారు.ఏమైనా సందేహాలుంటే 155251 కాల్ సెంటరుకు లేదా 95523 00003 నెంబరుకు వాట్సప్ చేయాలన్నారు.

ఊపిరి నిలిపిన 112



ధవళేశ్వరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఒక మహిళ ఊపిరిని 112 కాపాడింది. పోలీసుల తక్షణ స్పందనతో ఆత్మహత్యా యత్నం నుంచి వివాహిత బయట పడింది. కుటుంబ కలహాల నేపథ్యంలో కాటన్ బ్యారేజ్‌పై నుంచి ఒక మహిళ గోదావరిలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసుకునేందుకు బ్రిడ్జి పైకి వచ్చింది.ఈ మేరకు స్థానికులు గమనించి 112కు ఫోన్ చేసి సమాచారం అందించారు.కంట్రోల్ రూమ్ ద్వారా సమాచారం అందుకున్న ధవళేశ్వరం హెడ్ కానిస్టేబుల్ జీవీ.నర్సయ్య, కానిస్టేబుల్ టి.సాంబశివరావు సకాలంలో కాటన్ బ్యారేజ్‌పైకి వెళ్లి మహిళను రక్షించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులతో పంపివే శారు. గోదావరి ఉధృతంగా ఉన్న నేపథ్యంలో ఈ నెలలో ఇది రెండో ఘటన కావడం గమనార్హం. సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఆహాకీ!

4

ఆహా.. అనేలా హాకీ జూనియర్ మహిళల 15వ జాతీయ చాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభ మయ్యాయి.. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 18 జట్లతో మార్చ్‌ఫాస్ట్, పరేడ్ ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యేలు చినరాజప్ప, పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు పోటీల ప్రారంభ సూచికగా బెలూన్లను గాలిలోకి ఎగురవేశారు. 12 రోజుల పాటు జరిగే పోటీల్లో ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. పోటీలు మొదలయ్యాయి..



వానలకు రెడ్ సిగ్నల్

వా..నై!

ముఖం చాటేసిన వరుణుడు

ఏటా జూన్ నుంచి నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు పుంజుకుంటాయి. ఈ ఏడాది కూడా సకాలంలోనే నైరుతి రుతుపవనాలు రావ డంతో అంతా హమ్మయ్య అనుకున్నారు. వర్షాలకు లోటుండదని భావించారు. అటు ఖరీఫ్ సీజన్ పనులు ఆరంభించేశారు. తీరా చూస్తే ఈ సీజన్‌లో రుతుపవనాలు దాదాపుగా ముఖం చాటేశాయి. కుండపోతగా కురవాల్సిన వానలు జాడలేకుండా పోయాయి. దీంతో వర్షాభావ పరిస్థితులు తలెత్తాయి.

- ఉమ్మడి జిల్లాను వెన్నాడుతున్న వర్షాభావం
- జూలైలో కరుణ చూపని వరుణుడు
- సగం నైరుతి ముగిసినా చినుకు జాడ లేదు
- 60 మండలాల్లోనూ తీవ్ర లోటు
- మరోపక్క భానుడి భగభగలు
- జూన్‌లో కాస్తోకూస్తో బెటర్



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాను వర్షాభావం వెన్నాడుతోంది. నైరుతి రుతుపవనాలు ఊరించి ఊరించి ఉసూరు మనిపించాయి.జూన్‌లో కాస్త ప్రభావం చూపినా జూలైకు వచ్చే సరికి అసలు చినుకు జాడే లేదు.పైగా నైరుతి సీజన్ సగం ముగిసిపోవడంతో అన్ని మండలాలు తీవ్ర వర్షాభావంతో అల్లాడుతున్నాయి. ఒక్క కాకినాడ జిల్లాలో రెండు మండలాలు మినహా 19 మండలాలు లోటుతో ఉన్నాయి. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మొత్తం 41 మండలాలు లోటు వర్ష పాతంతో రెడ్‌మార్క్ జాబితాలో చేరాయి. దీంతో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసే వర్షాలపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు.గతేడాది ఇదే సీజన్‌లో వద్దంటే వర్షాలు ఉమ్మడి జిల్లాను ముంచెత్తాయి.ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జూలై అంతటా సూరీడు భగభగమంటూనే ఉన్నాడు. దీంతో జనం ఆపసోపాలతో అల్లాడారు.

లోటు వర్షపాతం..

ప్రస్తుతం నైరుతి రుతుపవనాల సీజన్ అప్పుడే సగం ముగిసిపోయింది. కానీ వాన జాడలేక లోటు వర్షపాతం వెన్నాడుతోంది. మరోపక్క రుతుపవనాల కారణంగా రోజంతా కారు మబ్బులతో వాతావరణం చల్లగా మారి వానలు కురవాల్సి ఉంటే దీనికి భిన్నంగా ఉదయం ఏడు నుంచే సూరీడు దంచేస్తున్నాడు. అసలు సిసలు వేసవిని తలపిస్తూ సాయంత్రం వరకు తీవ్ర వేడి, ఉక్కపోత కొనసాగుతోంది. ఉష్ణోగ్రతలు సైతం 35 దాటిపోతోంది. అటు విద్యుత్ వినియోగం భారీగా తగ్గాల్సిన సమయంలోను తీవ్రంగా డిమాండ్ పెరిగిపోతోంది. గడచిన రెండు నెలల్లో వానలు కురవాల్సిన దానికంటే తక్కువగా కురిసిన నేపథ్యంలో ఇంకా ఆగస్టు, సెప్టెంబరు నెలలే రుతుపవనాల ప్రభావంతో వానలు భారీగా కురవడానికి అవకాశం ఉంది. అయితే మరి వరుణుడు ఏం చేస్తాడో చూడాలి.

కాకినాడ జిల్లా : జూన్‌లో రుతుపవనాల ప్రభావం అంతోఇంతో కనిపించింది. దీంతో కాకినాడ జిల్లా 21 మండలాల్లో సరాసరి 96.57 మి.మీ. వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా 120.75 మి.మీ. నమోదైంది. జూలైకు వచ్చేసరికి 198 మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉంటే కేవలం 148 మి.మీ. మాత్రమే నమోదైంది. సరాసరిలో వ్యత్యాసం కొంతే ఉన్నా మండలాల వారీగా అధికంగా ఉంది. జూలైలో కాకినాడ జిల్లాలో గొల్లప్రోలు, తొండంగి మండలాలు మినహా మిగిలిన 19 మండలాలు వర్షా భావంతో అల్లాడుతున్నాయి. ఇదే గతేడాది జూలై లెక్కలు తీసుకుంటే కాకినాడ జిల్లాలో 198 మి.మీ.వర్షపాతం నమోద వ్వాల్సి ఉంటే ఏకంగా 223 మి.మీ. నమోదైంది. గడచిన జూన్, జూలైలో 300 మి.మీ.కు 269 మి.మీ. వర్షపాతం నమోదవడంతో మైనస్ 10.27 మి.మీ. లోటు తేలింది.

కోనసీమ జిల్లా : జూన్ నెలలో సరాసరి 102 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 108 మి.మీ. కురిసింది. 22 మండలాలకు 11 మండలాల్లో లోటు వర్షపాతం ఉంది. 11 మండలాల్లో మాత్రమే అధికంగా కురిసింది. జూలైకు వచ్చేసరికి తీవ్ర వర్షాభావం వెన్నాడింది. జిల్లా సరాసరి 241 మి.మీ. వానకుగాను 150మి.మీ. నమోదైంది. మండలాల వారీగా పరిశీలిస్తే మాత్రం 22 మండలాలు తీవ్ర లోటులో చిక్కుకు న్నాయి. గతేడాది జూలైలో కోనసీమ జిల్లా అంతా కలిపి 241 మి.మీ.వానకుగాను 339 మి.మీ. కురిసింది. అన్ని మండలాలు పుష్కలంగా వర్షంతో కళకళలాడాయి. ఈ జిల్లాలో జూన్,జూలై కలిపి మొత్తం 347.49 మి.మీ. సరాసరి వర్షపాతానికిగాను 258.37 మి.మీ. మాత్రమే నమోదై మైనస్ 25.65 మి.మీ. లోటుతో కొనసాగుతోంది.

తూర్పుగోదావరి జిల్లా : జూన్‌లో 107.77 మి.మీ.కు 145.27మి.మీ. వర్షం కురవడంతో బిక్కవోలు, కోరుకొండ మండలాలు మినహా మిగిలిన 17 మండలాలు అదనపు వర్షపాతం జాబితాలోకి చేరాయి. జూలైకు వచ్చేసరికి 247 మి.మీ. సరాసరి వర్షపాతానికి 169 మి.మీ. మాత్రమే కురిసింది.అదే మండలాల వారీగా చూస్తే మాత్రం మొత్తం 19 మండలాలు లోటు వర్షపాతంతో రెడ్‌మార్క్‌లోకి వెళ్లిపోయాయి. అదే గతేడాది జూలైలో జిల్లావ్యాప్తంగా 247 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 374 మి.మీ కురిసి అదనపు వర్షపాతం జాబితాలోకి వెళ్లిపోయాయి.ఈ జూన్, జూలై నెలల్లో తూ.గో. జిల్లాలో సరాసరి 363.18 మి.మీ. వర్షపాతం నమోదవాల్సి ఉండగా 316.22 మి.మీ. నమోదైంది.

కలెక్టర్ వెళ్లారు.. సమస్యలు విన్నారు..

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తానని హామీ



నాగసాయిని ఓదారుస్తున్న కలెక్టర్ ప్రశాంతి

గోకవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పించన్లను లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవా లని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో శుక్రవారం ఆమె పలువురు దివ్యాంగులు, వృద్ధులకు పించన్లు పంపిణీ చేశారు. సత్యనారాయణస్వామి కొండ వద్ద గల కాలనీలో నివాసం ఉంటున్న ఆడారి వీర వెంకట సత్యనారాయణ, వీరమణి దం పతుల ఇంటికి వెళ్లి వారి కుమార్తెలైన ఆడారి గంగా యమునా సరస్వతి, ఆడారి సాగసాయి అనే దివ్యాంగ బాలికలకు కలెక్టర్ పించన్ల సొమ్ము అందజేశారు. అనంతరం ఆ బాలికల యోగక్షేమాలను తల్లి వీరమణిని అడిగి తెలు సుకున్నారు. మేనరికం కారణంగా పెద్ద కు మార్తె గంగాయమునాసరస్వతి (21) పుట్టు కతోనే అంగవైకల్యం బారిన పడిందని తల్లి కన్నీటిపర్యంతమైంది. ఇక రెండో కుమార్తె నాగసాయి (18) 7వ తరగతి చదువుతుండగా పాఠశాలల్లో హఠాత్తుగా కళ్లు తిరిగి అపస్మారకస్థితికి చేరుకుందన్నారు. 2022 నుంచి పూర్తిగా కాళ్లు చచ్చుబడిపోయాయని కన్నీళ్లు పెట్టుకుంది. దీంతో కలెక్టర్ ఓదార్చారు. దివ్యాంగులైన ఇద్దరి బాలికలకు రెండు ట్రై సైకిళ్లు, వాకర్ అందజేస్తానని హామీ ఇచ్చారు.సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వాటిని తీసుకెళ్లాలని వారికి సూచించారు. అనంతరం చందం వెంకయ్యమ్మ అనే వృద్ధురాలికి పించను సొమ్ము అందజేసేందుకు కలెక్టర్ ఆమె ఇంటికి వెళ్లారు. మీరు ఎవరమ్మా అంటూ కలెక్టర్‌ను ఆ వృద్ధురాలు ప్రశ్నించారు. వెంటనే పక్కనే ఉన్న పంచాయతీ కార్యదర్శి రమణ కుమారి కలుగజేసుకొని ఈ మేడమ్ గారు కలెక్టర్ గారంటూ సమాధానం చెప్పారు. పించను డబ్బులు ఇవ్వడం కోసం ఇక్కడ వరకూ వచ్చారా మీరు చల్లంగ ఉండాలమ్మా అంటూ వృద్ధురాలు వెంకయ్యమ్మ కలెక్టర్‌ను దీవించింది.అనంతరం ఆమెతో కలెక్టర్ కాసేపు మాట్లాడారు. కలెక్టర్ ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా ఆ వృద్ధురాలు అనుసరించింది. వెంట రావొద్దని కలెక్టర్ వారించినా వస్తుండడంతో కలెక్టర్ ఆ వృద్ధురాలు చెయ్యి పట్టుకొని బయట వరకు నడిపించారు. ప్రతి వారం ఒక మండలంలో కలెక్టర్ పర్యటిస్తే బాధితులకు భరోసాగా ఉంటుంది.



వెంకయ్యమ్మ సమస్యలు వింటున్న కలెక్టర్



దుప్పలపూడిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, చినరాజప్ప, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నాయకులు యనమల, ఆకుల రామకృష్ణ

ఐదేళ్లలో పింఛన్లకే రూ.1,80,000 కోట్లు

మంత్రి నిమ్మల రామానాయుడు

అనపర్తి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఐదేళ్లలో కేవలం పించన్ల కోసమే రూ.1,80,000 కోట్లు ఖర్చు చేస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అనపర్తి మండలం దుప్పలపూడిలోని ఆర్వీఆర్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఎన్టీఆర్ స్పౌజ్ పించన్లు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి నెలా 1వ తేదీన పించన్ల పంపిణీ పండగ వాతావరణంలో జరుగుతుందన్నారు. రాష్ట్రంలో నూతనంగా 1.09 లక్షల మందికి స్పౌజ్ పించన్లు మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వం పెన్షన్ల పెంపు విషయంలో పేదలను మోసం చేస్తే కూటమి ప్రభుత్వం ముందు చెప్పిన విధంగానే పెన్షన్ రూ.4 వేలకు పెంచిందని గుర్తు చేశారు. అన్న క్యాంటీన్,తల్లికి వందనం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకాలు ఇప్పటికే అమలు చేశామని.. శనివారం అన్నదాన సుఖీభవ పథకం అమలు చేస్తున్నామన్నారు. 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం చట్టబద్ధంగా ప్రజాస్వామ్య రీతిలో పాలన చేస్తుందని ఎటువంటి కక్ష సాధింపులకు పాల్పడటం లేదన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలు మరో ఛాన్స్ ఇచ్చే అవకాశం లేదని తెలుసుకున్న జగన్ ఏమి చేస్తున్నాడో కూడా తెలుసుకోవడం లేదన్నారు. అనంతరం మంత్రి రామనాయుడు చేతుల మీదుగా 600 మంది లబ్ధిదారులకు స్పౌజ్ పించన్లు పంపిణీ చేశారు.

ప్రజా సంక్షేమానికి ఎన్టీఆర్ కృషి

ప్రజా సం క్షేమం కోసమే చివరి వరకు పనిచేసిన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిరస్మరణీయులని జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శుక్రవారం దుప్పలపూడిలో ఎన్టీఆర్, మూలారెడ్డి విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం రామవరంలోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మూలారెడ్డి వర్ధంతి సభలో మంత్రి పాల్గొన్నారు. మూలారెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్తమ కవి, సాహితీవేత్త బేతవోలు రామబ్రహ్మం, మానసిక వైద్యుడు కర్రి రామారెడ్డిలకు మూలారెడ్డి పేరిట పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చినరాజప్ప, వేగుళ్ళ జోగేశ్వరరావు,యనమల రామకృష్ణుడు,రుడా చైర్మన్ టీకేఆర్ చౌదరి పాల్గొన్నారు.

94.38 శాతం పింఛన్లు పంపిణీ

రాజమహేంద్రవరం, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి) : పింఛన్లను పంపిణీలో శుక్రవారం జిల్లా ఏడో స్థానంలో నిలిచింది. మధ్యాహ్నానికే ఏకంగా 91.72 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. జిల్లాలో 2,36,331 మందికి రూ.103.26 కోట్లు పంపిణీ చేయవలసి ఉండగా రూ.97 కోట్ల 10లక్షల 56వేల 500 పంపిణీ చేశారు.ఇతర ప్రాంతాల్లో ఉండడం తదితర కారణాలతో మిగతావారికి ఇవ్వలేకపోయారు. జిల్లాలో మొత్తం 94.38 శాతం పింఛన్లు పంపిణీ చేశారు.

అటెన్షన్ ప్లీజ్..

డీఆర్ఎం సార్..





పుష్కరాలు దగ్గరపడుతున్నాయి.. అయినా సమస్యల స్టేషన్లు..ఎప్పటికి పరిష్కరిస్తారో ఏమి టో.. ఏళ్ల తరబడి సమస్యలు వెన్నాడుతున్నా పరిస్థితిలో మాత్రం మార్పులేదు.మరో రెండేళ్ల లో పుష్కరాలు రానున్నాయి. ఇప్పటికైనా రైల్వే అధికారులు దృష్టి సారిస్తే తప్ప పుష్కరాల నాటికి సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉండదు. పుష్కరాల పనుల కోటాలో రైల్వే డీఆర్ఎం వస్తున్నట్టు సమాచారం. డీఆర్ఎంగా చార్జి తీసుకున్నాక తొలిసారి ఇటు వైపు రావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

- ఎవరికీ పట్టని గోదావరి స్టేషన్
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- రాజమండ్రి రైల్వే స్టేషన్‌దీ ఇదే పరిస్థితి
- కొవ్వూరు, నిడదవోలులోను ఇక్కట్లే
- నేడు రైల్వే డీఆర్ఎం రాక

రాజమహేంద్రవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి, కొవ్వూరు, నిడదవోలు రైల్వే స్టేషన్లలో సమస్యలు తిష్టవేసుకుని ఉన్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. అయినా అధికారుల్లో మాత్రం కదలిక ఉండడంలేదు.కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.280 కోట్లతో రాజమహేంద్రవరంలో చేయాల్సిన రీమోడల్ పనులకు ఎప్పుడు కొబ్బరికాయ కొడతారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. విజయవాడ డివిజన్ రైల్వే మే నేజర్ మోహిత్ సోనాకియా శనివారం పర్యటన నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

నాలుగు జిల్లాలకు గేట్‌వే వంటి రాజమండ్రి రైల్వే స్టేషన్లో పరిశుభ్రత అంతంత మాత్రంగా ఉండగా, కుక్కలు స్వైర విహారం చేస్తుంటాయి. రాజమండ్రి, గోదావరి రైల్వే స్టేషన్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డంగా మారాయి. గోదావరి స్టేషను ముందూ వెనుకా భద్రతాపరమైన సమస్యలు ఉన్నాయి. అయినా నేటికీ ఎవరూ దృష్టి పెట్టడం లేదు. అవసరమైనంత పార్కింగ్ ప్రదేశం ఉంది. దీంతో ఈ స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టు కల్పించాలని జనం కోరుతున్నారు. నిడదవోలు రైల్వే బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతుండడంతో ఏడాదిగా జనం అవస్థలు అన్నీ ఇన్నీ కావు. నిడదవోలు స్టేషనులో సూపర్ ఫాస్టులు ఆగకపోవడంతో ఎంత అభివృద్ధి చేస్తే మాత్రం ఉపయోగం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. స్టేషనులో సదుపాయాల్లేవు. పేరుకు మాత్రమే జంక్షనే అయినా ప్రయాణికుల్లో ఎప్పుడూ టెన్షనే. ఎఫ్‌సీఐ గోదాముల ద్వారా గూడ్స్ రవాణా రూపంలో ఆదాయం భారీగా వస్తున్నా ఈ స్టేషనులో ఇబ్బందులకు పరిష్కారం దొరకడం లేదు.ఇక కొవ్వూరులో చాలా రైళ్ల హాల్ట్ లేక 100 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైలు వచ్చే ముందు డిస్‌ప్లే బోర్డులు పనిచేయడం లేదు. రైలు వచ్చే ఐదు నిమిషాల ముందు అవి వెలగడంతో ప్రయా ణికులు ఉరుకులు పరు గులు పెడుతున్నారు. బాత్ రూమ్‌లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పరిశుభ్రత శూన్యంగా మారింది. రైల్వే డీఆర్ఎం ఆయా సమస్యలపై దృష్టి సారిం చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డీఆర్ఎం పర్యటన ఇలా

డీఆర్ఎం మోహిత్ సోనాకియా ఉదయం 10.30 గం టలకు ప్రత్యేక సెలూన్(బోగి)లో కొవ్వూరు చేరుకుని గంటపాటు పరిశీలిస్తారు. అక్కడి తనిఖీల అనంతరం కొవ్వూరులో పది నిమిషాలు,గోదావరి రైల్వే స్టేషనులో 15 నిమిషాలు, రాజమండ్రిలో 2 గంటలు తనిఖీలు నిర్వహిస్తారు.అనంతరం సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి కాకినాడ వెళతారు.



ఫుడ్ ప్లాజాలో రక్తపు మరకలు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..పెద్ద రైల్వే స్టేషన్

రాజమండ్రి రైల్వే స్టేషనులోని భద్రతా విషయంలో తీవ్ర నిర్లిప్తత కనిపిస్తోంది. ముందస్తు రక్షణను విధికి వదిలేశారు. ప్రయాణికుల భద్రత రైల్వే స్టేషను లోపల ప్రభుత్వ రైల్వే పోలీసు(జీఆర్పీ), రైల్వే రక్షక దళం(ఆర్పీఎఫ్) పరిధిలోకి వస్తే.. ప్రాంగణంలో రెండో పట్టణ పోలీసులు చూసుకుంటారు. అయితే ఒకరు చూసుకుంటారని మరొకరు అనుకుంటూ ఉండడంతో ప్రయాణికుల రక్షణ రెండిటికీ చెడ్డ రేవడిలా మారింది. పోలీసులు ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ ఆటో బూత్ కరోనా విపత్తు సమయం నుంచి సేవలకు దూరమైంది. రైల్ కోచ్ రెస్టారెంట్, మూతబడిన ఐఆర్‌సీటీసీ ఆహారం ఫుడ్ ప్లాజాలు అసాంఘిక వ్యక్తులకు అడ్డాగా మారాయి. రైల్వే స్టేషన్‌లో ఐఆర్‌సీటీసీ 'ఆహారం' ఫుడ్ ప్లాజా ఆరు నెలల కిందట మూతబడి కంపు కొడుతోంది. పగిలిన అద్దాలు, ఊడిపోయిన స్విచ్ బోర్డులు, ధ్వంసమైన సీలింగ్. ఇలా అపరి శుభ్రంగా ఉంది. ఈ ప్లాజా జీ+1 ఫ్లోర్లు ఉండగా.. మొదటి ఫ్లోరులో అసాంఘిక కార్యక లాపాలు జరుగుతున్న ఆనవాళ్లున్నాయి. ఇటీవల ఏలూరుకు చెందిన రామకృష్ణ అనే యాచకుడిపై పూటుగా మద్యం తాగి ఉన్న ముగ్గురు యువకులు దాడికి పాల్పడ్డారు. ఆ ముగ్గురు వ్యక్తుల్లో ఒకరి వద్ద గంజాయి ప్యాకెట్ ఉందని చెబుతున్నాడు. అంతకు ముందు ఇక్కడే చిన్న పిల్లతో యాచించుకొనే ఒక మహిళను పైఅంతస్తుకు తీసుకెళ్లినట్టు చెబుతున్నారు. దీనికి ఎదురుగా ఉన్న రైలు కోచ్ రెస్టారెంట్ వెనుక పట్టపగలే మద్యం సేవిస్తున్నారు. కోచ్ ప్రస్తుతం మూతబడినా.. దీనిని ఆనుకొని ఉన్న టీస్టాల్, రోజ్ మిల్క్, జ్యూస్ దుకాణాలు 24 గంటలూ తెరిచే ఉంటున్నాయి.దీంతో అర్ధరాత్రి వేళ మందు బాబులకు అడ్డాగా మారింది. రైల్వే ప్రాంగణంలో గొడవలు పరిపాటిగా మారిపోయాయి.ఆహారం ఫుడ్ ప్లాజాను ఆనుకొని 1,2,3,4 ప్లాట్‌ఫాంల నుంచి నేరుగా బయటకు వచ్చే మార్గం ఉంది. ఈ క్రమంలో రాత్రి వేళల్లో ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. రైల్వే స్టేషను నుంచి బయటికి వెళ్లే గేటు పక్కన 2017 మార్చి 29న అప్పటి ఎస్పీ బి.రాజకుమారి చొరవతో ప్రీపెయిడ్ ఆటో కం ఔట్‌పోస్ట్ ఏర్పాటైంది. రాత్రి వేళల్లో ఇది భరోసాగా ఉండేది.కరోనా విపత్తు సమయంలో మూతబడిన ఈ బూత్ మళ్లీ తెరుచుకోలేదు. ఇప్పటికైనా డీఆర్ఎం స్పందించి సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.


జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్


హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు (పైన), జ్యోతిప్రకాశనం చేస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ (కింద)






మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న ఏపీ క్రీడాకారులు




హోరాహోరీగా తలపడుతున్న మిజోరాం, రాజస్థాన్ జట్ల క్రీడాకారులు

క్రీడా సంరంభం

కాకినాడలో అట్టహాసంగా ప్రారంభమైన 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళల జాతీయ చాంపియన్‌షిప్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హాకీ ఇండియా జూనియర్ మహిళల 15వ జాతీయ చాంపియన్‌షిప్ కాకినాడలో శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమైంది. కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ జి.బిందుమాధవ్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి ముఖ్య అతిథులుగా, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డి, హాకీ ట్రిపుల్ ఒలింపియన్ ఆశాంత్ర లాక్ర, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత సత్య గీత, హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బి.చాణుక్యరాజు, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అతిథులుగా హాజరయ్యారు. తొలుత జిల్లా క్రీడా మైదానంలోని హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్సీలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హాకీ పోటీల ప్రారంభ సూచికగా కలెక్టర్ షాన్‌మోహన్ జాతీయ పతాకాన్ని, హాకీ ఇండియా పతాకాన్ని ఆశంత్రా లాక్ర, రాష్ట్ర పతాకాన్ని ఎమ్మెల్యే నానాజీ ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 18 హాకీ జట్లతో మార్చ్ ఫాస్ట్, పెరేడ్ ఘనంగా జరిగింది. ఆతిథ్యం ఇస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా జట్టు క్రీడాకారిణి లక్ష్మీప్రసన్న క్రీడా స్ఫూర్తితో టోర్నమెంటును విజయవంతం చేస్తామని అన్ని జట్ల క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు.

అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్ 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళల జాతీయ చాంపియన్‌షిప్‌ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించి బెలూన్లను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అందరి సహకారంతో పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామన్నారు. 12రోజుల పాటు జరిగే పోటీల్లో


ప్రారంభ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. టోర్నమెంటు నిర్వహణకు వివిధ అంశాలను స్పాన్సర్ చేస్తూ ఆర్థిక సహకారం అందించిన కార్పొరేట్, వ్యాపార, పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ ఏడు నెలల వ్యవధిలో రెండోసారి జాతీయ స్థాయి పోటీలకు కాకినాడ వేదిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అందరూ ఉత్తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించి క్రీడా స్ఫూర్తి చాటాలన్నారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ హాకీ టోర్నమెంట్ సజావుగా జరిగేందుకు అవసరమైన భోజనం, వసతి ఇతర అన్ని ఏర్పాట్లు సమకూర్చామని, 12 రోజులు జరిగే క్రీడా పండుగను విజయవంతం చేయాలన్నారు. జాతీయ సాయిలో జరుగుతున్న రైఫిల్ షూటింగ్ పోటీలకు సిద్ధమవుతున్న కాకినాడ నగర క్రీడాకారిణి ఆశ్రితకు కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ రవీంద్ర స్పాన్సర్ చేసిన రూ.2లక్షల చెక్‌ను కలెక్టర్, ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, సెట్రాజ్ సీఈవో కేఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు, సమాచార, పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, అర్బన్ తహసీల్దారు వి.జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు

కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో శుక్రవారం ప్రారంభమైన 15వ జాతీయ జూనియర్ మహిళల హాకీ పోటీల్లో భాగంగా తొలిరోజు...

ఎ-డివిజన్‌లో గోయన్స్ హాకీ, జమ్ముకశ్మీర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో గోయన్స్ జట్టు 2-1 స్కోరుతో, తెలంగాణ-గుజరాత్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 4-1 స్కోరుతో గుజరాత్, మిజోరాం-రాజస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 12-0 స్కోరుతో మిజోరాం విజయం సాధించాయి.

బి-డివిజన్‌లో మణిపూర్-కేరళ మధ్య జరిగిన మ్యాచ్‌లో 5-0 స్కోరుతో మణిపూర్, అసోం-పాండిచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌లో 5-0 స్కోరుతో అసోం, హిమాచల్‌ప్రదేశ్- అరుణాచల్‌ప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 6-2 స్కోరుతో అరుణాచల్‌ప్రదేశ్, ఢిల్లీ-హాకీ అసోసియేషన్ ఆఫ్ బిహార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 6-3 స్కోరుతో ఢిల్లీ విజయం సాధించాయి. మ్యాచ్‌లను టోర్నీ కో-ఆర్డినేటర్ వి.రవిరాజు పర్యవేక్షించారు.



కింగ్స్ జట్టు ఫ్రాంఛైజీలతో కెప్టెన్ భరత్

కాకినాడ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం

గర్వంగా ఉంది

ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు కేఎస్ భరత్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందని, తన జీవితంలో ముఖ్యమైన వారంతా కాకినాడలోనే ఉన్నారని క్రికెటర్ కేఎస్ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో కాకినాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్ కాకినాడలోనే చదువుకున్నారన్నారు. పుట్టింది కాకినాడలోనే అయినా విశాఖ తనను దత్తత తీసుకుందని తెలిపారు. అండర్- 13 విభాగంలో కాకినాడలో మ్యాచ్‌లు ఆడానంటూ ఆ రోజులను గుర్తు చేసుకున్నారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనే కాకినాడ కింగ్స్ జట్టు సభ్యులు ఆర్ఎంసీ మైదానంలో సాధన చేస్తున్నారన్నారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కృషితో ఆంధ్రా క్రికెట్ సంఘం అభివృద్ధి చెందుతోందన్నారు. విలేకరుల సమావేశంలో కింగ్స్ జట్టు ఫ్రాంఛైజీలు రామ్, అవినాష్, కార్యదర్శి సత్యనారాయణ, కోచ్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేము.. ఎలా వెళ్లేది!

- పేరుకే ఫాస్ట్ పాసింజర్ ప్రయాణం మాత్రం చాలా నెమ్మది
- అపరిశుభ్రంగా టాయిలెట్లు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు






నిడదవోలు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఈ రైలు కోసం ప్రతి రోజూ వెయ్యి కళ్లతో ఎదురుచూస్తారు. అరగంట ఆలస్యమైంద ంటే ఒకటే టెన్షన్.. ఎక్కేవారు.. దిగేవారితో నిత్యం రద్దీగా నే ఉంటుంది. అయినా ఆ రైలుపై ఎందుకో రైల్వే శాఖకు చిన్న చూపు.. సమస్యలు పట్టించు కోరు.. చెప్పినా వినిపించు కోరు.. చేసేది లేక అంత డిమాండ్ ఉన్న రైలులో నిత్యం ముక్కుతూ మూలుగుతూ ప్రయాణం చేస్తున్న వారి సంఖ్య వేలల్లో ఉంటుంది. నిత్యం కాకినాడ పోర్టు నుంచి విజయవాడకు, తిరిగి సాయంత్రం విజయవాడ నుంచి కాకినాడ పోర్టుకు చేరుకుంటుంది. ఈ రైలులో ఉద్యోగులు, ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లేవారు ఎందరో రాకపోకలు సాగిస్తుంటారు. వేరే ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నవారు అక్కడ పనిచేసే ప్రాంతాల్లో ఇళ్ల అద్దెలు భరించలేక, కుటుంబాలను, ఉన్న ఊరిని మార్చలేక ఇలా ఎన్నో కారణాలతో ఈ పాస్ట్ పాసింజర్ రైలులో ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చేందుకే మక్కువ చూపుతున్నారు. కొవి డ్‌కు ముందు 16 బోగీలతో పాస్ట్ పాసింజర్‌గా రాకపోకలు సాగించే ఈ రైలు కొవిడ్ తరువాత 8 బోగీలతో ఎక్స్‌ప్రెస్ చార్జ్‌లను వసూలు చేస్తోంది. ఇలా రైలులో మూడే టాయ్‌లెట్స్ ఉండడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అవి కూడా అత్యంత దారుణంగా ఉంటున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వే శాఖకు ఎంతో ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న పాస్ట్ పాసింజర్ రైలులో బోగీలను పెంచి చార్జీలను తగ్గించి పరిశుభ్రతకు ప్రాధాన్యతకు ఇవ్వాలని రైల్వే అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.

యువర్ అటెన్షన్ ప్లీజ్.. ఈ ట్రెన్ పేరు విజయవాడ మేము. కానీ ఉభయ గోదావరి జిల్లాలో ఇది ఎంతోమందికి పాస్ట్ పాసింజర్ రైలుగానే తెలుసు. కొవిడ్‌కు ముందు పాస్ట్ పాసింజర్‌గా తిరిగిన రైలు కొవిడ్ తరువాత ఎక్స్‌ప్రెస్ పేరుతో తిరుగుతోంది. కానీ జర్నీ మాత్రం పాసింజరే. చార్జీలు ఎక్కువవయ్యాయి.. దీంతో ప్రయాణికులకు పాట్లు తప్పడంలేదు.





ఎక్స్‌ప్రెస్ పేరుతో అధిక చార్జీలు



నిత్యం రైలులో నిడదవోలు నుంచి విజయవాడకు తిరిగి నిడదవోలుకు రాకపోకలు సాగిస్తుంటా. ఈ ఫాస్ట్ పాసింజర్ రైలుకు ఎక్స్‌ప్రెస్ పేరుతో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు.రైలులో టాయ్‌లెట్లు ఏమాత్రం శుభ్రంగా ఉంచరు. రైల్వే అధికారులు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడం లేదు.

-వెంకటేశ్వరరావు, ప్రయాణికుడు.

ఒక బోగి కూడా పెంచరు



ఈ రైలు ప్రయాణీల్లో నేను ఒకడిని. కొవిడ్‌కు ముందు 16 బోగీలతో ఉండే రైలు ఆపై 8 బోగీలకు పరిమితమైంది. ఎప్పుడు రద్దీగా ఉండే రైలుకు కనీసం ఒక బోగి కూడా పెంచరు. ఎక్స్‌ప్రెస్ పేరుతో టికెట్‌కు అధిక ధరలు వసూలు చేస్తున్నా ప్రయాణం తప్పడం లేదు.

-సురేష్, ప్రయాణికుడు.



బాలాత్రిపుర సుందరికి సామూహిక కుంకుమ పూజలు

కొవ్వూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఉన్న లలితపార్వతీ అమ్మవారికి అర్చకులు మానేపల్లి సుబ్రమ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

ఏటికొప్పాక బొమ్మలు కొనుగోలు చేసిన నాగబాబు

పిఠాపురం రైల్వే స్టేషన్‌లో వన్ స్టేషన్-వన్ ప్రాడక్ట్ షాపు ప్రారంభం


ఏటికొప్పాక బొమ్మ కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

పిఠాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్‌లో భాగంగా కాకినాడ జిల్లా పిఠాపురం రైల్వే స్టేషన్‌లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండీక్రాఫ్ట్ స్టాల్‌ను జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు శుక్రవారం ప్రారంభించారు. ఏటికొప్పాక బొమ్మలను పరిశీలించిన ఆయన కొన్నిటిని కొనుగోలు చేశారు. అనంతరం పిఠాపురం పట్టణ శివారు ఏడు కాలువల వద్ద వ్యవసాయ శాఖ అందజేసిన డ్రోన్లను ప్రారంభించారు. కొత్తపల్లి మండలం కొమరగిరి శివారు ఆనందనగర్‌లో జనసేన వీర మహిళ పిట్టా ముని ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధం కావడంతో జనసేన నాయకుడు జ్యోతుల శ్రీనివాస్ సహకారంతో ఇంటిని నిర్మించారు. ఆ ఇంటి తాళాలను ఆమెకు నాగబాబు అందజేశారు.

జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులకు శిక్షణ


క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఎటపాక, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల అనంతరం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన 42 మంది విద్యార్థులకు శుక్రవారం ప్రత్యేక శిక్షణ ప్రారంభించారు. వీరికి భారత టేబుల్ టెన్నిస్ రిప్రజెంటేటర్ రియాజ్ శిక్షణ ఇవ్వనున్నట్టు వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. వీరిలో 21 మంది బాలురు, 21 మంది బాలికలు ఉన్నారు. శిక్షణలో విద్యార్థులకు అన్ని రకాల మెలకువలతోపాటు ప్రతి రోజు హైజెనిక్ ఆహారం అందిస్తారు. 15 రోజుల శిక్షణ అనంతరం జాతీయ స్థాయి పోటీలకు అస్సాం వెళ్లనున్నారు. ఈ నెల 18,19,20 తేదీల్లో అక్కడ జరిగే పోటీల్లో పాల్గొననున్నారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నలుగురికి ఉద్యోగాలు


జేఎన్టీయూకే వీసీతో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

జేఎన్టీయూకే, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలోని యూసీఈకే ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నలుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు పీఆర్వో ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. 40 మంది హాజరు కాగా బ్యాంకింగ్ టెక్నాలజీ కంపెనీ జిటా ద్వారా సీఎస్ఈ విద్యార్థులు పి.హర్షవర్ధన్, వీసీహెచ్ఎన్ఎస్వీఎల్ వైష్ణవి, సీహెచ్ ప్రీతి, జి.వెంకటశ్రీ సుమేధ ఎంపికయ్యారు. వీరికి రూ.18లక్షల వార్షిక ప్యాకేజీ ఇస్తారన్నారు. ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ ఉంటుందని, ప్రతినెలా రూ.60 వేలు స్టైఫండ్ అందజేస్తారు. ఉద్యోగార్థులను ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్.మోహన్‌రావు, ప్లేస్‌మెంట్ సెల్ అధికారి డాక్టర్ అరవ కరుణ అభినందించారు.

వాడపల్లి వెంకన్న ఆలయంలో పూజలు


వాడపల్లి వెంకన్న ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,71,925 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. రాత్రి దేవదాయ శాఖ అదనపు కమిషనరు తెనాలి చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వారికి వేద పండితుల ఆశీర్వచనం అందించగా ఈవో స్వామివారి చిత్రపటం అందించారు.

పనులు పరిశీలించిన ఆర్డీవో.. ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ పరిశీలించారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణం, కోనేరు నిర్మాణ పనులతోపాటు భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న రహదారులు, మంచినీటి సౌకర్యం, వైద్య శిబిరాలు, క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించారు.

జలజీవన్‌తో గ్రామాల్లో నీటి నాణ్యత పరీక్షించాలి

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గాలి నాణ్యత సూచికను లెక్కించే తరహాలోనే నీటి నాణ్యత సూచికను లెక్కించడానికి దేశంలో ఎలాంటి ప్రామాణిక వ్యవస్థ లేదని, గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా నీటి నాణ్యతను పరీక్షించాలని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. నీటి నాణ్యతపై రియల్‌టైం మోనిటరింగ్, వాటర్ క్వాలిటీ ఇండెక్స్ ఏర్పాటుపై శుక్రవారం ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి సోమన్న లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. పట్టణ ప్రాంతాల్లో నీటి నాణ్యత పర్యవేక్షణ బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదేనని పేర్కొన్నారు. అమృత్, అమృత్ 2.0 మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేకమైన డబ్ల్యూక్యూఐ లెక్కింపును కేంద్రం నిర్దేశించలేదని బదులిచ్చారు. నీటి నాణ్యతా ప్రమాణాల అమలుపై పర్యవేక్షణ జరుగుతుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ వ్యాప్తంగా 3.92 లక్షల గ్రామాల్లో 2.48 లక్షల ప్రయోగశాల నమూనాలు సేకరించినట్టు వెల్లడించారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో

జీఎస్ఎల్ వైద్య విద్యార్థికి చోటు


ఫణి అజయ్‌ను అభినందిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): విశేషమైన అధ్యయనం చేసి పీర్-రివ్యూడ్ జర్నల్‌కు పరిశోధన పత్రాన్ని సమర్పించిన రాజానగరం జీఎస్ఎల్ వైద్య కళాశాల ఎంబీబీఎస్ విద్యార్థి, పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన జీజీ ఫణిఅజయ్ పేరు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు నమోదయ్యింది. 19 సంవత్సరాల కేటగిరిలో అతడికి ఈ గౌరవం దక్కింది. గ్రామీణ ప్రాంత ఉపాధ్యాయుల్లో ఎఫ్ఈవీ-1 ప్లేట్‌లెట్ పారామీటర్లపై ఫిజియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కవిత మార్గదర్శకత్వంలో అజయ్ ఈ పరిశోధన చేశారు. దీనిని వేలూరు సీఎంసీలో జరిగిన ఎండ్రోక్రినాలజీ అంతర్జాతీయ కాంగ్రెస్‌లో సమర్పించగా సైంటిఫిక్ జర్నల్‌లో ప్రచురితమైంది. గ్రామీణ టెక్స్‌టైల్ కార్మికులు, పాఠశాల ఉపాధ్యాయుల బయోకెమికల్ పారామీటర్లపై అజయ్ చేసిన పరిశోధనకు బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ యూబీ విజయలక్ష్మి మార్గదర్శకత్వం వహించారు. దీనిని కాకినాడలో జరిగిన సైంటిఫిక్ కాన్ఫరెన్స్‌లో సమర్పించి ప్రచురించారు. ఈ సందర్భంగా అజయ్‌ను జీఎస్ఎల్ సంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ఎండీ డాక్టర్ గన్ని సందీప్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్కే మిశ్రా తదితరులు అభినందించారు.

వ్యక్తి మృతి కేసులో తల్లీకూతుళ్ల అరెస్ట్

మండపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అనుమానాస్పద కేసులో తల్లీకూతుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఇప్పనపాడు పంచాయతీ పరిధిలో ఎర్రదిబ్బకాలనీకి చెందిన వాకాడ వీర్రాజు (45) ఇంటిలో భార్య, కూమార్తెతో గొడవపడి మరుసటిరోజు అనుమానాస్పదంగా మృతిచెందాడు. వీర్రాజు గుండెపోటుతో మరణించాడని అతడి భార్య, కూమార్తె అందరినీ నమ్మించారు. గత నెల 17న జరిగిన ఈ సంఘటనపై వీర్రాజు కుమారుడు మండపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తన తల్లి, చెల్లి కలిసి తండ్రిని హత్యచేసి గుండెపోటుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని చెప్పడంతో గత నెల 21న పోలీసు, రెవెన్యు అధికారులు వీర్రాజు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం దర్యాప్తులో వీర్రాజు భార్య సత్యవేణి, కుమార్తె లావణ్యను అరెస్టు చేసి శుక్రవారం ఆలమూరు మున్సిపల్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజుల పాటు రిమాండ్ విధించారు. వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని మండపేట రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ

అల్లవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలో ఓ గ్రామంలో 16 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన యువకుడిపై పోక్సో చట్టం కేసు నమోదు కావడంతో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ శుక్రవారం విచారణ చేపట్టారు. బాలికపై అయినవిల్లి మండలంలో ఓ గ్రామానికి చెందిన నవుండ్రు రాకేష్ అత్యాచారం చేశాడని బాలిక తల్లిదండ్రులు అల్లవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ, అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఘటనా స్థలిలో దర్యాప్తు చేశారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని టీడీపీ కార్యకర్త మృతి



నాగరాజు (ఫైల్)

ఉప్పలగుప్తం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలెం పంచాయతీ బొర్రాయిపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త దోనిపాటి నాగరాజు (30) గురువారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బైక్‌పై వెళ్తున్న నాగరాజును స్కూల్ బస్సు ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్టు మృతుడి తండ్రి గణపతి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం నాగరాజు మృతదేహాన్ని బొర్రాయిపాలెం తీసుకువస్తున్నట్టు సర్పంచ్ నల్లా బాబండి తెలిపారు.

నకిలీ టీపొడి విక్రయంపై కేసు

రావులపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తమ కంపెనీకి చెందిన పేరుతో నకిలీ టీపొడి విక్రయిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదుపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టాటా చక్రగోల్డ్ లేబుల్‌తో ఉన్న నకిలీ టీపొడిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం షిరిడి సాయి మణికంఠ దుకాణంలో విక్రయిస్తున్నారంటూ కంపెనీ ప్రతినిధి ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

మహిళను గాయపరిచిన వ్యక్తి అరెస్ట్

దేవీపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మహిళను గాయపరిచిన వ్యక్తిపై శుక్రవారం దేవీపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం పరగసానిపాడు ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన మహిళను పెద్దభీంపల్లి గ్రామానికి చెందిన నేలపాటి రాజేష్ కర్రతో గాయపరిచాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామచంద్రమోహన్

- సేవాదల్ ద్వారా వచ్చే సేవకులను వినియోగించుకోవాలి
- ఖర్చు చేసే ప్రతిరూపాయి సౌకర్యాల కల్పనకు ఉపయోగపడాలి
- దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్
- అన్నవరం దేవస్థానంలో అధికారులు, సిబ్బందితో సమీక్ష

అన్నవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో సేవలందించేందుకు విచ్చేసే సేవాదల్ సభ్యుల సేవలను వినియోగించుకుని వారి ద్వారా భక్తులకు మరింత మెరుగైన సేవలందించాలని దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ సూచించారు. శుక్రవారం కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ఆగమ పాఠశాల, ఇతర నిర్మాణాలను పరిశీలించి కమాండ్ కంట్రోల్‌రూం నందు అన్ని విభాగాల ఏఈవోలు, సూపరెంటెండెంట్, ఇంజనీరింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది జీతాల కోసం పనిచేస్తుండగా సేవాదల్ సభ్యులు అవేమి ఆశించకుండా సేవలందిస్తున్నారని వారికి సౌకర్యాల కల్పన విషయంలో రాజీపడవద్దని సూచించారు. ఇంజనీరింగ్ విభాగం ద్వారా ఖర్చు చేసే ప్రతిరూపాయి భక్తుల సౌకర్యాల కల్పనకు ఉపయోగపడేవిధంగా ఖర్చుపెట్టాలన్నారు. ఆగమ పాఠశాల పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన విద్యార్థులు తమ ఆహార పదార్థాలు స్వీకరించిన ప్లేట్‌లు, గ్లాసులు వేడినీటితో శుభ్రంచేసేందుకు వీలుగా గ్రీజర్‌ను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా అదనంగా మరో మనిషిని ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న మెయిన్ క్యాంటీన్ లైసెన్స్ హక్కుకు ఎవరూ రానందున దానిని డార్మెటరీగా వినియోగించుకోవాలని సూచించారు. సీఆర్వో కార్యాలయం వద్ద నూతనంగా భక్తులకు అవసమైన తినుబండారాలు విక్రయించుకునేందుకు క్యాంటీన్ ఏర్పాటుచేయాలన్నారు. సిబ్బంది అంతా ఎస్‌ఓపీ నిబంధనలు పాటించాలని, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సెంట్రలైజ్డ్ శానిటేషన్ కాంట్రాక్ట్ ఈనెల 15 కల్లా ఫైనల్ అవుతుందని ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు పీఎఫ్ సొమ్ముల విషయమై కమిషనర్‌ను కలవగా కార్మికులు ప్రతినెలా తమ సొమ్ములు జమ అవుతున్నాయా లేదా అనేది చూసుకోవలసిన బాధ్యత ఉందన్నారు. వర్షపు నీరు వృథాగా పోకుండా లక్ష లీటర్ల నీటిని నిల్వచేసేందుకు ఏర్పాటుచేసిన అల్యూమినియం ట్యాంక్‌ను పరిశీలించారు. సమీక్షలో దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, ఆర్జేసీ త్రినాధరావు, లోవ దేవస్థానం ఈవో విశ్వనాధరాజు పాల్గొన్నారు. అంతకముందు సత్యదేవుడిని దర్శించుకున్న ఆయనకు ఆలయ ఈవో, చైర్మన్‌లు ఘనస్వాగతం పలకగా వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

ఆసుపత్రి నుంచి ఆగమ పాఠశాల విద్యార్థుల డిశ్చార్జి



అన్నవరంలో వేద విద్యార్థులతో మాట్లాడుతున్న దేవదాయ కమిషనర్

తునిరూరల్/అన్నవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అస్వస్థతతో కాకినాడ జిల్లా తుని ఏరియా ఆసుపత్రిలో చేరిన అన్నవరం దేవస్థానం స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులు 11 మంది శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. ఆగమ పాఠశాలకు మధ్యాహ్నం సురక్షితంగా చేరుకున్నారు. మంత్రి ఆనం రామనారాయణ విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థుల అస్వస్థతకు గల కారణాలను మంత్రి ఫోన్ ద్వారా ఆలయ అధికారులను అడిగినట్టు తెలుస్తోంది. దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ విద్యార్థులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వారికి కావల్సిన సౌకర్యాలను తక్షణమే అందించాలని అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు విభాగ అధికారులకు సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఘనంగా చండీహోమం



పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్రహోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తప్పిన పెను ప్రమాదం

బోల్తా కొట్టిన నాఫ్తా ట్యాంకర్‌ను సురక్షితంగా పైకి తీసిన ఓఎన్జీసీ సిబ్బంది



బోల్తా కొట్టిన ఓఎన్జీసీ ట్యాంకర్‌ను పైకి లేపుతున్న ఓఎన్జీసీ, ఫైర్ సిబ్బంది

ముమ్మిడివరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం దొమ్మేటిపారివాలెం వద్ద పెను ప్రమాదం తప్పింది. నాఫ్తాను తీసుకెళ్తూ బోల్తా కొట్టిన ఓఎన్జీసీ ట్యాంకర్‌ను శుక్రవారం ఉదయం భారీ క్రేన్ సహాయంతో పైకి లేపడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. తాటిపాక ఓఎన్జీసీ సైట్ నుంచి సుమారు 29వేల లీటర్ల నాఫ్తా చెన్నైకు తీసుకెళ్తుండగా ముమ్మిడివరం నగర పంచాయతీ బైపాస్ రోడ్డులోని దొమ్మేటిపారివాలెం వద్ద గురువారం అర్ధరాత్రి అదుపు తప్పి బోల్తా కొట్టింది. వెంటనే ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఓఎన్జీసీ అధికారులకు సమాచారం అందించారు. అక్కడ ఫైర్ ఇంజన్లు, అంబులెన్సులను సిద్ధం చేశారు. ట్రాఫిక్‌ను ముమ్మిడివరం మీదుగా మళ్లించి ఘటనా స్థలానికి వంద మీటర్ల మేర ప్రజల్ని ఖాళీ చేయించారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా 2 అంబులెన్సులు ముమ్మిడివరం, అమలాపురం ఫైర్ ఇంజన్లతో పాటు ఓఎన్జీసీకి చెందిన మరో 2 ఫైర్ ఇంజన్లు, 4 క్రేన్‌లను సిద్ధం చేశారు. ఓఎన్జీసీ సెక్యూరిటీ ఆఫీసర్ బలరామ్ సిబ్బందితో చేరుకుని ట్యాంకర్ క్యాప్ నుంచి లీకవుతున్న నాఫ్తాను అదుపుచేసి ట్యాంకర్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారు. చిన్న క్రేన్లతో సాధ్యకాకపోవడంతో భారీ క్రేన్‌ను తీసుకువచ్చి ఫోమ్ పిచికారీ చేస్తూ 3 గంటల పాటు శ్రమించి ఉదయం 7.30 గంటల సమయంలో పైకి లేపారు. ట్యాంకర్ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. ట్యాంకర్‌లో ఉన్న నాఫ్తా సుమారు 2వేల లీటర్లు నేల పాలు అయింది. నాఫ్తా గాలిలో కలిసి వెంటనే ఫైర్ అయ్యే స్వభావం ఉంది. దీంతో చుట్టుపక్కల వారిని ఖాళీ చేయించి అటుగా వాహనాల రాకపోకలు సాగించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అక్కడ విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేయించారు. ఫైర్, ఓఎన్జీసీ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేసి ట్యాంకర్‌ను సురక్షితంగా పైకి లేపారు. దీంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బోల్తా కొట్టిన ట్యాంకర్‌కు మరమ్మతులు చేసి అక్కడినుంచి తరలించారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తాళ్లరేవు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి తప్పిపోయిన 12 ఏళ్ల బాలుడిని శుక్రవారం పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం నీలపల్లి హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న శ్రీరామ్ (12) తప్పిపోవడంతో అతడి నానమ్మ మందపల్లి వీరమ్మ కోరింగ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదనపు ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసుల బృందం తక్షణం స్పందించి 6గంటల సమయంలో బాలుడి ఆచూకీ కనిపెట్టి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ధన్యవాదాలు తెలియజేశారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో 'శ్యామ్' విద్యార్థుల ప్రతిభ

కార్పొరేషన్/కాకినాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్స్ 2025 ఫలితాల్లో కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. శుక్రవారం శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించిన చైర్మన్ జి.శ్యామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ప్రకటించిన పోలీసు కానిస్టేబుల్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు 67శాతం విజయంతో ప్రభంజనం సృష్టించారన్నారు. సివిల్ కానిస్టేబుల్స్ విభాగంలో జి.నానాజీ(విశాఖ), మహిళా విభాగంలో రమ్యమాధురి(విజయనగరం), అలాగే ఏపీఎస్పీ విభాగంలో ఎం.అచ్యుతరావు(విశాఖ) స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించడం ఇనిస్టిట్యూట్‌కే గర్వకారణమన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు కలిపి 6014 ఉద్యోగాలకు ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు 4005కు పైగా ఉద్యోగాలను తమ ఇనిస్టిట్యూట్ ద్వారా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ కోచింగ్ టెస్ట్ సిరీస్, మెటీరియల్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు విజయం సాధించారని తెలిపారు.

మంచి విజయం సాధించా



నా పేరు మేరుగ అచ్యుతరావు. నాది అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామం. కానిస్టేబుల్ ఫలితాల్లో 144.5 మార్కులతో ఏపీఎస్పీ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాను. మా నాన్న సముద్రంలో చేపల వేటకు వెళ్తాడు. అమ్మ కూలీ పనికి వెళ్లి రోజుకు రూ.400 సంపాదించి ఇంటిని చూసుకుంటుంది. చోడవరం ఆఫ్‌లైన్ సెంటర్‌లో శ్యామ్ ఇనిస్టిట్యూట్ సండే మోడల్ టెస్‌లు రాస్తూ, గ్రౌండ్ స్కోర్ ఎక్కువతో మంచి విజయాన్ని సాధించాను.

విజయం అంకితం



నా పేరు గొర్లి రమ్యమాధురి. మాది విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం గడసాం గ్రామం. కానిస్టేబుల్ ఫలితాల్లో 159 మార్కులతో మహిళల విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాను. అమ్మే చదివించింది. నా విజయంలో అమ్మ, అన్నయ్యలతో పాటు స్నేహితులు పాలు పంచుకున్నారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌లైన్ మోడల్ టెస్ట్ సిరీస్ విజయనగరం సెంటర్‌లో రాసేదాన్ని.

ఆ ముగ్గురే కారణం



నా పేరు గండి నానాజీ. విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురం మండలం దొప్పెర్ల గ్రామం. కానిస్టేబుల్ ఫలితాల్లో 168 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాను. నాన్న మేకలకాపరి. అమ్మ వ్యవసాయ కూలీ. అన్నయ్య ఎలక్ట్రికల్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. అమ్మ, నాన్న, అన్నయ్య కష్టమే ఈ రోజు నేను స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించడానికి ముఖ్య కారణం.

జలకళ

నిండిన సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని జలాశయాలు



నిండుగా ఉన్న డొంకరాయి జలాశయం

మోతుగూడెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. జలాశయాలకు సుమారు 14 టీఎంసీల నీరు చేరిందని జెన్‌కో అధికారులు లెక్కగడుతున్నారు. బలిమెల జలాశయానికి సుమారు 11టీఎంసీలు చేరినట్టు తెలిపారు. ఏపీపీ డ్యాం, డొంకరాయి జలాశయానికి సుమారు 7వేల క్యూసెక్కుల చేరుతుండటంతో నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. సీలేరుకు 1500క్యూసెక్కులు, బలిమెల జలాశయానికి సుమారు 9500 క్యూసెక్కులు వస్తున్నాయి. జోలాపుట్, బలిమెలలో ప్రస్తుతం ఉన్న 45.90 టీఎంసీల్లో 25.39టీఎంసీలు ఆంధ్రా వాటాగా ఉంది. డొంకరాయి, గుంటవాడ జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న 9.71టీఎంసీలతో కలిపి మన రాష్ట్రం వాటాగా 35.10 టీఎంసీల నిల్వలు ఉన్నట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. లోడ్ డిస్పాచ్ సెంటర్ ఆదేశాల మేరకు సీలేరు కాంప్లెక్స్‌లోని అన్ని విద్యుత్తు కేంద్రాల్లో నిరాటంకంగా ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 9.36 మిలియన్ యూనిట్ల విద్యుత్పత్తి జరుగుతోంది.

ఆర్మీ ర్యాలీ, హాకీ టోర్నీలకు రూ.90వేలు విరాళం



కలెక్టర్ షాన్‌మోహన్‌కు చెక్కు అందిస్తున్న నారాయణ విద్యాసంస్థల ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ నిర్వహణకు కాకినాడ నారాయణ విద్యాసంస్థలు రూ.90వేలు విరాళం ఇచ్చాయి. ఈ కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు విరాళం చెక్కును డీజీఎం ఎస్డీవీ కృష్ణ, ఏజీఎం కె.రాఘవేంద్రరావు శుక్రవారం అందజేశారు. డీఐఈవో శారద, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అతి పెద్ద రాజకీయ కుట్ర : రత్నాకర్

కాకినాడ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దళితుల ఐక్యతపై ఎస్సీ వర్గీకరణ దేశ చరిత్రలో అతి పెద్ద రాజకీయ కుట్ర అని మల మహానాడు (రాక్స్) జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ విమర్శించారు. కాకినాడలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణ వల్ల వందలో నలుగురికే లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ ఫలాలను దేశవ్యాప్తంగా ఎస్సీ జాబితాలో ఉన్న 1,108 ఎస్సీ కులాలకు ప్రధాని మోదీ ఎలా పంచుతారన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని 59 ఎస్సీ కులాలకు ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఎలా ప్రయోజనం చేకూర్చగలరన్నారు. మాల సామాజికవర్గీయులంతా శాంతియుత పోరాటానికి సిద్ధం కావాలని కోరారు.

అయస్కాంతం ముక్క మింగిన బాలిక

తొలగించిన వైద్యులు



వైద్యులు తొలగించిన ముక్క

ప్రత్తిపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురద కోట గిరిజన తండాకు చెందిన మాడెం రమ్య 1వ తరగతి విద్యార్థిని రింగ్ ప్యాకెట్‌లో ఉన్న అయస్కాంతం ముక్కను మింగేసింది. దీంతో బాలికను కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ముక్కను వైద్యులు తొలగించారు. బురదకోట సమీపంలోని బాపన్నధారకు చెందిన మాడెం రమ్య బురదకోటలోని గిరిజన ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి చదువుతుంది. అయితే రింగ్ ప్యాకెట్లు తినే అలవాటు ఉన్న బాలిక ఆ ప్యాకెట్‌లో తిను పదార్థాలతో పాటు అయస్కాంతం ముక్కను కూడా మింగేసింది. దీంతో బాలికను ప్రత్తిపాడు, ఏలేశ్వరంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించినప్పటికీ అయస్కాంతం తొలగించే సదుపాయాలు లేవని కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం వైద్యులు అయస్కాంతం ముక్కను తొలగించారు. ఈ అంశంపై సంబంధిత రింగ్ కంపెనీపై న్యాయ పోరాటం చేస్తామని బాలిక తల్లిదండ్రులు తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

పింఛన్ల సొమ్ము దుర్వినియోగం

ఐదుగురు సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ

ప్రత్తిపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్ము రూ.14లక్షలు దుర్వినియోగం చేశారు. మూడేళ్లుగా లబ్ధిదారులకు చెల్లించకుండా మిగిలిన సొమ్మును ఖజానాకు జమ చేయకుండా వ్యక్తిగత అవసరాల కోసం వినియోగించారు. దీంతో ఈ వ్యవహారంపై ప్రత్తిపాడు ఎంపీడీవో ఐదుగురు సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో పింఛన్ల నిమిత్తం 11,539 మందికి రూ.5,05,47500 నెలవారీ ఖర్చు చేస్తున్నారు. అయితే ప్రతి నెలా పలు కారణాల వల్ల కొంత సొమ్ము సచివాలయ సిబ్బంది వద్ద నిలిచిపోతుంది. 2021 నుంచి 2024 మధ్యలో ఈ విధంగా రూ.30లక్షల వరకు మిగిలిన సొమ్ములు సచివాలయ ఉద్యోగుల వద్దే ఉండిపోయాయి. వీటిని వెనువెంటనే స్థానిక ఖజానా కార్యాలయంలో జమ చేయాల్సి ఉన్నప్పటికీ నిబంధనలు పట్టించుకోకుండా సచివాలయ ఉద్యోగులు సొంత అవసరాలకు వాడుకోవడం విషయం బయటకు పొక్కింది. ఈ క్రమంలో రూ.16లక్షల వరకు గతంలో ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు రికవరీ చేసి ఖజానాకు జమ చేయించారు. అయితే ఇంకా రూ.14 లక్షల వరకు సచివాలయ ఉద్యోగుల వద్ద ఉండిపోవడంతో ఎంపీడీవో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐదుగురు సచివాలయ ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. వీటిలో గోకవరం పంచాయతీకి చెందిన రూ.2,03,250, చినశంకర్లపూడికి చెందిన రూ.7,46,250, గజ్జనపూడికి చెందిన రూ.45వేలు, ధర్మవరానికి చెందిన రూ.1,90,250, ఒమ్మంగి పంచాయతీకి చెందిన రూ.3.75లక్షలు పింఛన్ల పంపిణీ సొమ్ము తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమ చేయాల్సి ఉంది. దీంతో నిధులు దుర్వినియోగం చేసినట్టు భావించి ఐదుగురు సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులను ఎంపీడీవో జారీ చేశారు. 24 గంటలలోపు రూ.14లక్షలు ఖజానాకు జమ చేసి రసీదును ఎంపీడీవో ఆఫీసులో అందజేయాలనిఆదేశించారు.



రాయి.. చూసుకువెళ్లవోయ్!

కాకినాడ రామారావు పేట ప్రకాశం వీధిలో రోడ్డు మధ్య భాగాన గుంత పడింది. దీంతో వానదారులు ప్రమాదాలకు గురవుతారని స్థానికులు పెద్ద రాయిని ఏర్పాటు చేశారు.
–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

గట్టు తెగితే ముప్పే!

బిక్కవోలులో కోతకు గురవుతున్న సామర్లకోట కాలువ గట్టు



బిక్కవోలులో సామర్లకోట కాలువ గట్టుపై వున్న రావిచెట్టు



చెట్టు అడుగున సగ భాగం వరకూ కోతకు గురైన గట్టు

బిక్కవోలు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని సామర్లకోట కాలువ గట్టు కోతకు గురవ్వడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గట్టుపై పెద్ద రావిచెట్టు వుంది. రావి చెట్టు వ్రేళ్ల గట్టు కిందకు దిగడంతో నీటి ప్రవాహానికి ఆప్రాంతంలో గట్టు సగం వరకూ కోతకు గురయ్యింది. వర్షా కాలం కాబట్టి వర్షాలు ఎక్కువగా కురిసి కాలువలో నీరు పూటెక్కితే గట్టు మరింత కోతకు గురై చెట్టు కూలితే గట్టు తెగి అంబటి పేట నీట మునిగి పెను ప్రమాదం సంభవించే అవకాశం వుందని అంబటి పేట వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గట్టును సరి చేయాలని వారు అధికారులను కోరుతున్నారు.

నేడు రైతుల ఖాతాలకు అన్నదాత సుఖీభవ సొమ్ములు

కోరుకొండ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈ నెల 2న అన్నదాత సుఖీభవ సొమ్ములు రైతుల ఖాతాల్లో జమ కానున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మొదటి విడతగా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన కింద రైతులకు అందజేసే రూ.2 వేలుకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాలో జమ చేయనున్నట్టు తెలిపారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని, ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. వాతావరణ పరిస్థితులు కొంత అనుకూలించపోయినప్పటికీ పుష్కర, చాగల్నాడు, వెంకటనగరం, తొర్రిగడ్డ, ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులందరికీ సాగునీరు అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

బిక్కవోలులో 5915 మంది..

బిక్కవోలు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్నదాన సుఖీభవ పథకంలో 5915 మంది రైతులు లబ్ధి పొందనున్నారని వ్యవసాయాధికారి శామ్యూల్‌జాన్ శుక్రవారం తెలిపారు. మండలంలోని అర్హులైన రైతుల ఖాతాల్లో రూ.4.14 కోట్లు జమ కానున్నట్టు చెప్పారు.

'ప్రభుత్వ విధానాలతో విద్యారంగం నిర్వీర్యం'

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో తీసుకుంటున్న రాజకీయ నిర్ణయాలు ప్రభుత్వ విద్యావిధానాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి ఎస్.అరుణకుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఎస్‌టీఎఫ్‌ఐ పతాకావిష్కరణ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలోని యూటీఎఫ్ కేంద్ర కార్యాలయం వద్ద ఆమె జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఎస్‌టీఎఫ్‌ఐ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలతో ప్రభుత్వ విద్య రోజు రోజుకూ బలహీన పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకులుగా ఉండేందుకు ముందుకురావాలి

ఆర్డీవో కృష్ణనాయక్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) సంపన్నులు, సాధికారత కల్గిన వ్యక్తులు గ్రామ, పట్టణాల్లోని నిరుపేద కుటుంబాలకు మార్గదర్శకులుగా ఉండేందుకు ముందుకు రావాలని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని బంగారు కుటుంబాల గుర్తింపు సహకార చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం అనేది పూర్తిగా ఆర్థిక బాధ్యతలు భరిస్తారని కాదని, మానవీయ దృక్పథంతో మార్గనిర్దేశక బాధ్యతగా తీసుకోవాలన్నారు. దీన్ని సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. గ్రామ, మండల స్థాయిలో అధికారులు, వలసవచ్చిన పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటరమణ



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లోని పేద మహిళల ఆర్థిక సాధికారత లక్ష్యంగా స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.వెంకటరమణ సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పీజీ ఆర్ఎస్ హాలులో మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘాలకు ఎస్‌జీహెచ్ రుణాల, బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు సూర్య ఘర్, ముద్ర స్టాండప్ ఇండియా, స్ట్రీట్ వెండర్స్ సర్వే సహ పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహాయక గ్రూప్ సభ్యుల ఉన్నతిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.జిల్లా వ్యాప్తంగా 10,852 స్వయం సహాయ సంఘాలు ఉన్నట్టు వెల్లడించారు. అలాగే జిల్లాలో స్వయం సహాయక సంఘాలలోని మహిళల ఆదాయ వనరులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. మొబైల్ మార్టులు, ర్యాపిడో వెహికల్స్ తృప్తి క్యాంటీన్, టూరిజం సర్వీసెస్ అమృతమిత్ర వంటి స్పెషల్ ప్రాజెక్టులను ప్రారంభించడం ద్వారా ఎక్కువ మంది మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. అందుకు సంబంధించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అలాగే పీఎం సూర్యఘర్ ఎంతో మంచి పథకమని జిల్లాలోని ప్రజలు విరివిరిగా వినియోగించుకునేలా ప్రతి ఇంటికి పథకాన్ని తీసుకెళ్లేలా అధికారులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో జిల్లా టెక్నికల్ ఎక్స్‌పర్ట్ ఎం.ఫణికుమార్, పి.శ్రీదేవి, సీఎంఎంలు రామలక్ష్మి, ఎ.జ్యోతి, కమ్యూనిటీ ఆర్గనైజర్, డీఈవోలు పాల్గొన్నారు.

న్యాయవాది ఆచార్యులును కలిసిన

విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు



ఆచార్యులుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు, అమలాపురం అర్బన్ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్‌గా హైకోర్టు న్యాయవాది ఎన్‌వీఎస్‌కే ఆచార్యులు నియమితులైన సందర్భంగా ఆయనను శుక్రవారం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు లక్కోజు వీరభద్రరావు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు కలిశారు. స్థానిక టీటీడీ కల్యాణ మడపం పక్కనున్న కార్యాలయంలో ఆచార్యులును మర్యాద పూర్వకంగా కలుసుకుని, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ తాడేపల్లిగూడెం కన్వీనర్ నక్కా చిట్టిబాబు, అనుపోజు వెంకటరమణ మూర్తి, గుంటముక్కల స్వామి, పొలమూరి మణి, ముక్కామల స్వామి, వీరబాబు, ఎ.గంగాధరం, కె.వాసు, పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దేవరపల్లి వెంకన్న ఆలయంలో పూజలు



విష్ణుసహస్ర నామ పారాయణం చేస్తున్న మహిళా భక్తులు

దేవరపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం లో శ్రావణ శుక్రవారం సందర్భంగా లలితా విష్ణుసహస్రనామ పారాయణం, గోవింద నామాలను మహిళా భక్తులు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక కుకుంమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, ఆలయ ఆలయ అర్చకులు కేశవచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

పలుచోట్ల వితంతు పెన్షన్ల పంపిణీ



ధవళేశ్వరంలో పెన్షన్ అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన సాగుతుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన వితంతు పింఛన్లను ఆర్డీవో కృష్ణనాయక్‌తో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఒక్కొక్కటిగా సూపర్ సిక్స్ పథకాలు అమలవుతున్నాయన్నారు. వితంతు పింఛన్లు నూతనంగా రాజమహేంద్రవరం రూరల్ మండంలో 284 మంజూరు కాగా ధవళేశ్వరంలో 69 మందికి మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, తహశీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, టీడీపీ మండలాధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, వాసిరెడ్డి రాంబాబు, పండూరి అప్పారావు, పుకళ్ల రాజు, తలారి మూర్తి, సావాడ శ్రీనివాసరెడ్డి, ఆళ్ల ఆనందరావు పాల్గొన్నారు.

పింఛన్ల విధానంలో మార్పులు



నరేంద్రపురంలో పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం/కోరుకొండ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గతంలో 6 నెలలకు ఒకసారి కొత్త పింఛన్లు మంజూరు చేసేవారని, ప్రస్తుతం పింఛన్ల విధానంలో కీలక మార్పులు తెచ్చామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజానగరం మండలంలోని పలు గ్రామాలతోపాటు కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో శుక్రవారం ఆయన పర్యటించి స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భర్త చనిపోతే వెంటనే భార్యకు పింఛను అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇదిలా ఉండగా కోరుకొండ మండలంలో 223 మందికి, సీతానగరంలో 187, రాజానగరంలో 256 మందికి రూ.26.64 లక్షలు ఎన్టీఆర్ భరోసా కింద వితంతు పింఛన్లు అందజేసినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమాల్లో శ్రీరంగపట్నం సర్పంచ్ మద్దాల పెద అమ్మాజీ, మద్దాల రమణ, అడ్డాల శివ, ముక్కా రాంబాబు, బుద్దా బాపూజీ, మళ్ళ అప్పల నర్సారావు, బదిరెడ్డి సత్యనారాయణ మూర్తి, రేపాక సూర్య చంద్రం పాల్గొన్నారు.

'కేసులు ఎత్తివేయాలి'

కొవ్వూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేరళకు చెందిన సిస్టర్ వందన ఫ్రాన్సిస్, సిస్టర్ ప్రీతి మేరీపై ఛత్తీస్‌ఘడ్ రైల్వే పోలీసులు పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని లిబరేషన్ కాంగ్రెస్ జిల్లా కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. బలవంతంగా మత మార్పిడి, బాలిక అక్రమ రవాణా అంటూ తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు.

రంగంపేట ఐసీడీఎస్ సీడీపీవోగా కృష్ణవేణి బాధ్యతల స్వీకారం



రంగంపేట, ఆగస్టు, 1(ఆంధ్రజ్యోతి): రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా కె.కృష్ణవేణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం, తల్లుల శ్రేయస్సు, పోషకాహారంపై మరింత దృష్టిసారిస్తానన్నారు. ఆశా, అంగన్‌వాడీ సిబ్బందిలో సమన్వయం పెంచుతూ,రంగంపేట ప్రాజెక్టును ఆదర్శంగా నిలిపేలా కృషి చేస్తానన్నారు.

కోరుకొండ నరసన్న ఆలయంలో సుదర్శన యాగం

కోరుకొండ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సుదర్శన యాగం నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ యాగంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ పూర్ణాహుతి ద్రవ్యాలతో గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించాలి

డీపీవో శాంతమణి

చాగల్లు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేకు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి శాంతమణి అన్నారు.గ్రామకంఠం భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు రీసర్వేను శుక్రవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రోన్ కెమెరాల సహాయంతో జరిగే సర్వేకు సహకరించాలని, ప్రభుత్వ భూములు గుర్తించడం, లబ్ధిదారులకు న్యాయం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. ఆ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు కరుటూరి సతీష్, పంచాయతీ సర్పంచ్ మనశ్శాంతి, పంచాయతీ కార్యదర్శి మొహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం

- ఐసీడీఎస్ సీడీపీవో గౌరమ్మ
- ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు
- పలుచోట్ల అవగాహన సదస్సులు



దివాన్‌చెరువులో మాట్లాడుతున్న సీడీపీవో గౌరమ్మ

దివాన్‌చెరువు, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జి.గౌరమ్మ అన్నారు. అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవాలు సందర్భంగా దివాన్‌చెరువు-4 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశానికి సీడీపీవో ముఖ్యఅతిథిగా విచ్చేసి తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ బిడ్డకు అందించవలసిన ముర్రుపాలను, వాటిలో ఉండే పోషకాలను వివరించారు. తల్లి పాలు ఇవ్వడం వల్ల బిడ్డకు, తల్లికి కలిగే లాభాలను చెప్పారు. తల్లి తీసుకోవలసిన ఆహార నియమాలను తెలియజేశారు.కార్యక్రమంలో ఏసీడీపీవో టి.కనకవల్లి, సూపర్‌వైజర్ వి.మేరి, ఏఎన్ఎం పి.కావ్య అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, ఆశాకార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



రంగంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

రంగంపేట: రంగంపేట పీహెచ్‌సీ వద్ద తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మీ మాట్లాడుతూ తల్లి పాలు శిశువు మొదటి రక్షణ కవచమని, చిన్న పిల్లలలో పోషకాహార లోపాలను నివారించడంలో తల్లిపాలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. బిడ్డకు మొదటి ఆరు నెలలు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు కె.చిన్నారావు, కె.మేరీ హెలెనా, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.



రాజానగరంలో మానవహారం చేస్తున్న విద్యార్థులు

రాజానగరం: తల్లి పాల వారోత్సవాలు సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జీఎస్ఎల్ నర్సింగ్ విద్యార్థులతో కలసి ర్యాలీ, స్థానిక సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. తల్లి ప్రాధాన్యత తెలియజేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ వెంకటలక్ష్మి, జీఎస్ఎల్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాప్రవీణ, వైస్ ప్రిన్సిపాల్ విజయపల్లవి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణవి పరిశోధన ఆదివాసీ అభ్యున్నతికి ఉపయుక్తం



ప్రణవికి పీహెచ్‌డీ అవార్డు కాపీ అందజేస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ అభ్యున్నతికి, ప్రజా విధాన రూపకల్పనకు పరిశోధనా విద్యార్థి దాకే ప్రణవి చేసిన పరిశోధన ఎంతో ఉపయోగపడుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయలం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. వర్శిటీలోని కామర్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్ నుంచి ప్రణవి పీహెచ్‌డీ పూర్తిచేశారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం పీహెచ్‌డీ అవార్డు కాపీని ప్రణవికి వీసీ అందజేశారు. ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వనవాసుల సామాజిక ఆర్థిక స్థితిగతులపై సంక్షేమ పథకాల ప్రభావం మూల్యాంకనం అనే అంశంపై నన్నయ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ఆచార్య ఎన్.ఉదయభాస్కర్ మార్గదర్శకత్వంలో పరిశోధన పూర్తిచేశారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, పరిశోధనాభివృద్ధి డీన్ పి.విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జడ్జిమెంట్ డే

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మాదిగ న్యాయవాదులు సమైక్య ఆధ్వర్యంలో జడ్జిమెంట్ డే వేడుకలు రాజమహేంద్రవరంలోని ఆనం రోటరీ హాలులో ఘనంగా జరిగాయి. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల బార్ కౌన్సిల్ సభ్యులు బి.జయకర్, జాతీయ అధ్యక్షుడు వీవీ రత్నం, అధికార ప్రతినిధి కె.ప్రసాదరావు, రాష్ట్ర అధ్యక్షుడు జాల పుల్లన్న పాల్గొని మాట్లాడారు. మాదిగల చీకటి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు మంద కృష్ణ మాదిగ అని కొనియడారు. ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల ఉద్యమ ఫలితంగా 2024 ఆగస్టు 1న ఏడుగురు జడ్జిల ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ న్యాయబద్ధమైనదని తీర్పునిచ్చిందన్నారు. ఆ శుభదినాన్ని జడ్జిమెంట్ డేగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ వర్గీకరణతో మాదిగల్లో భవిష్యత్ తరాలకు వర్గీకరణ ఫలాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిక్లరేషన్ చేశారు.పేదల ప్రయోజనాల కోసం మంద కృష్ణ ఏ నిర్ణయం తీసుకున్నా మాదిగ న్యాయవాదులు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తారని, తెలుగు రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు జారీ చేసిన ఎస్సీ వర్గీకరణ జీవోల ప్రకారం ప్రభుత్వంలో ఉన్న అన్ని శాఖలు ఆ జీవోలను కచ్చితంగా అమలు చేయాలనే డిక్లరేషన్‌లను చేశారు.

ఏకగ్రీవం దిశగా ఎన్నిక..

- కడియపులంక సర్పంచ్ ఉప ఎన్నికకు ముగిసిన నామినేషన్లు
- ఇద్దరు అభ్యర్థులు మూడు నామినేషన్లు..
- ఒకరు ఉపసంహరించుకునే అవకాశం

కడియం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కడియపులంక సర్పంచ్ ఉప ఎన్నికల్లో అభ్యర్థి ఎన్నిక దాదాపు ఏకగ్రీవానికి చేరుకుంది. దివంగత సర్పంచ్ మార్గాని అమ్మాణీ గుండెపోటుతో మృతి చెందారు. ఈ స్థానం ఖాళీ అవ్వడంతో ఆమె కుమార్తె మాదిశెట్టి పద్మావతి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ ప్రారంభమైన మొదటి రోజు ఓ నామినేషన్, శుక్రవారం మరో నామినేషన్‌ను వేశారు. రెండో రోజు పద్మావతి బంధువు మార్గాని సత్యవేణి నామినేషన్ దాఖలు చేశారు. దీంతో మాదిశెట్టి పద్మావతి, మార్గాని సత్యవేణి మాత్రమే నామినేషన్లు వేశారు. నామినేషన్ల పరిశీలన, అభ్యంతరాలు, నామినేషన్ల ఉపసంహరణ సమయానికి మార్గాని సత్యవేణి తన నామినేషన్ ఉపసంహరించుకునే అవకాశాలు ఉండగా, మాదిశెట్టి పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

మూడు నామినేషన్లు

మాదిశెట్టి పద్మావతి రెండు నామినేషన్లు, మార్గాని సత్యవేణి ఓ నామినేషన్ వేశారని, దీనితో నామినేషన్లు ముగిసే సమయానికి ఇద్దరు అభ్యర్థులు, మూడు నామినేషన్లు దాఖలయ్యాయని స్టేజ్-1 రిటర్నింగ్ అధికారి మణికుమార్ తెలిపారు.

నల్లమిల్లి మూలారెడ్డి వర్ధంతి

బిక్కవోలు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆర్ఎస్. పేటలో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన మూలారెడ్డి విగ్రహాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డితో కలసి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా వితంతు పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే బిక్కవోలు వంతెన వద్ద మూలారెడ్డి విగ్రహానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రంగంపేట: మండలంలోని దొడ్డిగుంట గ్రామంలో మూలారెడ్డి విగ్రహానికి పలువురు కూటమి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

భాషానైపుణ్యాలూ అవసరమే

రాజానగరం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి తోడు భాషానైపుణ్యాలు కూడా అవసరమని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం కులపతి కేవీవీ సత్యనారాయణరాజు అన్నారు. జీజీయూలోని ఇంగ్లీషు విభాగంలో కేంబ్రిడ్జి అందిస్తున్న ఇంగ్లీషు సర్టిఫికేషన్ కోర్సు పూర్తి చేసిన 9 మంది విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం మాట్లాడుతూ బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలు సాధించేందుకు ఇటువంటి నైపుణ్యాలు విద్యార్థులకు మేలు చేస్తాయన్నారు. భావవ్యక్తీకరణను భాష ద్వారా చక్కగా తెలియజేయవచ్చునన్నారు. కార్యక్రమంలో జీజీయూ ప్రొ వైస్‌చాన్సలర్ కేవీబీ రాజు, ఆంగ్ల విభాగాధిపతి సంఘ మిత్ర, అధ్యాపకులు శైలజ, మహాలక్ష్మి, పాండు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్ కోసం

11న ఇంటర్ కమిషనరేట్ ఎదుట ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఈనెల 11న ఇంటర్మీడియట్ బోర్డు కమిషనరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాణిక్యం గొర్ల విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియ తక్షణమే పూర్తి చేయాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే కాంట్రాక్టు లెక్చరర్ల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని తెలిపారు. గత ఏడాది మే నెలకు సంబంధించిన వేతనం వెంటనే విడుదల చేయాలని తదితర ప్రధాన డిమాండ్లతో 11వ తేదీన ధర్నా చేపడుతున్నామని మాణిక్యం పేర్కొన్నారు.

చిన కాశీ రేవుకు దారి మారింది..!



భక్తుల రాకపోకలకు మార్గం ఉంచిన అధికారులు, రైల్వే గోడను ఐరన్ గేటుతో మూసివేసిన దృశ్యం (ఇన్‌సెట్లో)

నిడదవోలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాశీరేవుకు వెళ్లేందుకు భక్తులు రైల్వే పట్టాలు దాటాల్సి ఉంటుంది. అయితే రైల్వే అధికారులు శుక్రవారం రైల్వే ట్రాక్‌పై నుంచి రాకపోకలు సాగించే వీల్లేకుండా రైల్వే గోడకు ఐరన్ గేటు బిగించేశారు. దీంతో సమాచారం అందుకున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోర్త ప్రమోద్‌కుమార్, తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని రైల్వే అధికారులతో మాట్లాడుతూ ప్రత్యామ్నాయ మార్గం చూపించాలన్నారు. అప్పటి వరకు భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. దీనిపై రైల్వే అధికారులు స్పందించి కొంతమార్గం వదిలేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చామంతి భీమేశ్వరరావు, కొత్తలంక భగవాన్, కాసాని జ్ఞాన లహరి, మోర్త సాయి కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత గంగరాజు మృతి

గోపాలపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గోపాలపురానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత దాత మద్దిపాటి వెంకట్రాజు(58) శుక్రవారం మృతి చెందారు. ఆయన ఓటు హక్కు వచ్చి నప్పటి నుంచి టీడీపీలోనే కొనసాగుతూ ... పార్టీలో కీలక పాత్ర పోషించారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శనివారం 2 ఆగస్టు 2025





నేడు అన్నదాత సుఖీభవ



నిడదవోలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకానికి గ్రీన్ సిగ్నల్ పడింది. రైతుల ఖాతాల్లో శనివారం నుంచి సొమ్ములు జమవుతాయని మంత్రి కం దుల దుర్గేష్ ప్రకటించారు.ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన రైతన్నల ఖాతాల్లో పెట్టుబడి సాయం తొలి విడతగా రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ 2 వేలు మొత్తం రూ.7 వేలు ఒక్కో రైతు ఖాతాలో జమ వు తుందన్నారు.మూడు విడతల్లో రూ.20 వేలు చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తారన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.14 వేలు, కేంద్రం వాటా రూ.6 వేలు అన్నారు. ఒక వేళ అర్హులై ఉండి నగదు జమకాని రైతులు ఎవరైనా ఉంటే ఆందోళన అవసరం లేదన్నారు.ఏమైనా సందేహాలుంటే 155251 కాల్ సెంటరుకు లేదా 95523 00003 నెంబరుకు వాట్సప్ చేయాలన్నారు.

ఊపిరి నిలిపిన 112



ధవళేశ్వరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఒక మహిళ ఊపిరిని 112 కాపాడింది. పోలీసుల తక్షణ స్పందనతో ఆత్మహత్యాయత్నం నుంచి వివాహిత బయట పడింది. కుటుంబ కలహాల నేపథ్యంలో కాటన్ బ్యారేజ్‌పై నుంచి ఒక మహిళ గోదావరిలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసుకునేందుకు బ్రిడ్జి పైకి వచ్చింది.ఈ మేరకు స్థానికులు గమనించి 112కు ఫోన్ చేసి సమాచారం అందించారు.కంట్రోల్ రూమ్ ద్వారా సమాచారం అందుకున్న ధవళేశ్వరం హెడ్ కానిస్టేబుల్ జీవీ.నర్సయ్య, కానిస్టేబుల్ టి.సాంబశివరావు సకాలంలో కాటన్ బ్యారేజ్‌పైకి వెళ్లి మహిళను రక్షించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులతో పంపివే శారు. గోదావరి ఉధృతంగా ఉన్న నేపథ్యంలో ఈ నెలలో ఇది రెండో ఘటన కావడం గమనార్హం. సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఆహాకీ!

ఆహా.. అనేలా హాకీ జూనియర్ మహిళల 15వ జాతీయ చాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 18 జట్లతో మార్చ్‌ఫాస్ట్, పరేడ్ ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యేలు చినరాజప్ప, పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు పోటీల ప్రారంభ సూచికగా బెలూన్లను గాలిలోకి ఎగురవేశారు. 12 రోజుల పాటు జరిగే పోటీల్లో ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. పోటీలు మొదలయ్యాయి..

6

వానలకు రెడ్ సిగ్నల్



వా..న్లే!

ముఖం చాటేసిన వరుణుడు

ఏటా జూన్ నుంచి నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు పుంజుకుంటాయి. ఈ ఏడాది కూడా సకాలంలోనే నైరుతి రుతుపవనాలు రావ డంతో అంతా హమ్మయ్య అనుకున్నారు. వర్షాలకు లోటుండదని భావించారు. అటు ఖరీఫ్ సీజన్ పనులు ఆరంభించేశారు. తీరా చూస్తే ఈ సీజన్‌లో రుతుపవనాలు దాదాపుగా ముఖం చాటేశాయి. కుండపోతగా కురవాల్సిన వానలు జాడలేకుండా పోయాయి. దీంతో వర్షా భావ పరిస్థితులు తలెత్తాయి.

- ఉమ్మడి జిల్లాను వెన్నాడుతున్న వర్షాభావం
- జూలైలో కరుణ చూపని వరుణుడు
- సగం నైరుతి ముగిసినా చినుకు జాడ లేదు
- 60 మండలాల్లోనూ తీవ్ర లోటు
- మరోపక్క భానుడి భగభగలు
- జూన్‌లో కాస్తోకూస్తో బెటర్



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాను వర్షాభావం వెన్నాడుతోంది. నైరుతి రుతుపవనాలు ఊరించి ఊరించి ఉసూరు మనిపించాయి.జూన్‌లో కాస్త ప్రభావం చూపినా జూలైకు వచ్చే సరికి అసలు చినుకు జాడే లేదు.పైగా నైరుతి సీజన్ సగం ముగిసిపోవడంతో అన్ని మండలాలు తీవ్ర వర్షాభావంతో అల్లాడుతున్నాయి. ఒక్క కాకినాడ జిల్లాలో రెండు మండలాలు మినహా 19 మండలాలు లోటుతో ఉన్నాయి. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మొత్తం 41 మండలాలు లోటు వర్ష పాతంతో రెడ్‌మార్క్ జాబితాలో చేరాయి. దీంతో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసే వర్షాలపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు.గతేడాది ఇదే సీజన్‌లో వద్దంటే వర్షాలు ఉమ్మడి జిల్లాను ముంచెత్తాయి.ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జూలై అంతటా సూరీడు భగభగమంటూనే ఉన్నాడు. దీంతో జనం ఆపసోపాలతో అల్లాడారు.

లోటు వర్షపాతం..

ప్రస్తుతం నైరుతి రుతుపవనాల సీజన్ అప్పుడే సగం ముగిసిపోయింది. కానీ వాన జాడలేక లోటు వర్షపాతం వెన్నాడుతోంది. మరోపక్క రుతుపవనాల కారణంగా రోజంతా కారు మబ్బులతో వాతావరణం చల్లగా మారి వానలు కురవాల్సి ఉంటే దీనికి భిన్నంగా ఉదయం ఏడు నుంచే సూరీడు దంచేస్తున్నాడు. అసలు సిసలు వేసవిని తలపిస్తూ సాయంత్రం వరకు తీవ్ర వేడి, ఉక్కపోత కొనసాగుతోంది. ఉష్ణోగ్రతలు సైతం 35 దాటిపోతోంది. అటు విద్యుత్ వినియోగం భారీగా తగ్గాల్సిన సమయంలోను తీవ్రంగా డిమాండ్ పెరిగిపోతోంది. గడచిన రెండు నెలల్లో వానలు కురవాల్సిన దానికంటే తక్కువగా కురిసిన నేపథ్యంలో ఇంకా ఆగస్టు, సెప్టెంబరు నెలలే రుతుపవనాల ప్రభావంతో వానలు భారీగా కురవడానికి అవకాశం ఉంది. అయితే మరి వరుణుడు ఏం చేస్తాడో చూడాలి.

కాకినాడ జిల్లా : జూన్‌లో రుతుపవనాల ప్రభావం అంతోఇంతో కనిపించింది. దీంతో కాకినాడ జిల్లా 21 మండలాల్లో సరాసరి 96.57 మి.మీ. వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా 120.75 మి.మీ. నమోదైంది. జూలైకు వచ్చేసరికి 198 మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉంటే కేవలం 148 మి.మీ. మాత్రమే నమోదైంది. సరాసరిలో వ్యత్యాసం కొంతే ఉన్నా మండలాల వారీగా అధికంగా ఉంది. జూలైలో కాకినాడ జిల్లాలో గొల్లప్రోలు, తొండంగి మండలాలు మినహా మిగిలిన 19 మండలాలు వర్షా భావంతో అల్లాడుతున్నాయి. ఇదే గతేడాది జూలై లెక్కలు తీసుకుంటే కాకినాడ జిల్లాలో 198 మి.మీ.వర్షపాతం నమోద వ్వాల్సి ఉంటే ఏకంగా 223 మి.మీ. నమోదైంది. గడచిన జూన్, జూలైలో 300 మి.మీ.కు 269 మి.మీ. వర్షపాతం నమోదవడంతో మైనస్ 10.27 మి.మీ. లోటు తేలింది.

కోనసీమ జిల్లా : జూన్ నెలలో సరాసరి 102 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 108 మి.మీ. కురిసింది. 22 మండలాలకు 11 మండలాల్లో లోటు వర్షపాతం ఉంది. 11 మండలాల్లో మాత్రమే అధికంగా కురిసింది. జూలైకు వచ్చేసరికి తీవ్ర వర్షాభావం వెన్నాడింది. జిల్లా సరాసరి 241 మి.మీ. వానకుగాను 150మి.మీ. నమోదైంది. మండలాల వారీగా పరిశీలిస్తే మాత్రం 22 మండలాలు తీవ్ర లోటులో చిక్కుకు న్నాయి. గతేడాది జూలైలో కోనసీమ జిల్లా అంతా కలిపి 241 మి.మీ.వానకుగాను 339 మి.మీ. కురిసింది. అన్ని మండలాలు పుష్కలంగా వర్షంతో కళకళలాడాయి. ఈ జిల్లాలో జూన్,జూలై కలిపి మొత్తం 347.49 మి.మీ. సరాసరి వర్షపాతానికిగాను 258.37 మి.మీ. మాత్రమే నమోదై మైనస్ 25.65 మి.మీ. లోటుతో కొనసాగుతోంది.

తూర్పుగోదావరి జిల్లా : జూన్‌లో 107.77 మి.మీ.కు 145.27మి.మీ. వర్షం కురవడంతో బిక్కవోలు, కోరుకొండ మండలాలు మినహా మిగిలిన 17 మండలాలు అదనపు వర్షపాతం జాబితాలోకి చేరాయి. జూలైకు వచ్చేసరికి 247 మి.మీ. సరాసరి వర్షపాతానికి 169 మి.మీ. మాత్రమే కురిసింది.అదే మండలాల వారీగా చూస్తే మాత్రం మొత్తం 19 మండలాలు లోటు వర్షపాతంతో రెడ్‌మార్క్‌లోకి వెళ్లిపోయాయి. అదే గతేడాది జూలైలో జిల్లావ్యాప్తంగా 247 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 374 మి.మీ కురిసి అదనపు వర్షపాతం జాబితాలోకి వెళ్లిపోయాయి.ఈ జూన్, జూలై నెలల్లో తూ.గో. జిల్లాలో సరాసరి 363.18 మి.మీ. వర్షపాతం నమోదవాల్సి ఉండగా 316.22 మి.మీ. నమోదైంది.

కలెక్టర్ వెళ్లారు.. సమస్యలు విన్నారు..

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తానని హామీ



నాగసాయిని ఓదారుస్తున్న కలెక్టర్ ప్రశాంతి

గోకవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవా లని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామంలో శుక్రవారం ఆమె పలువురు దివ్యాంగులు, వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. సత్యనారాయణస్వామి కొండ వద్ద గల కాలనీలో నివాసం ఉంటున్న ఆడారి వీర వెంకట సత్యనారాయణ, వీరమణి దం పతుల ఇంటికి వెళ్లి వారి కుమార్తెలైన ఆడారి గంగా యమునా సరస్వతి, ఆడారి సాగసాయి అనే దివ్యాంగ బాలికలకు కలెక్టర్ పింఛన్ల సొమ్ము అందజేశారు. అనంతరం ఆ బాలికల యోగక్షేమాలను తల్లి వీరమణిని అడిగి తెలు సుకున్నారు. మేనరికం కారణంగా పెద్ద కు మార్తె గంగాయమునాసరస్వతి (21) పుట్టు కతోనే అంగవైకల్యం బారిన పడిందని తల్లి కన్నీటిపర్యంతమైంది. ఇక రెండో కుమార్తె నాగసాయి (18) 7వ తరగతి చదువుతుండగా పాఠశాలల్లో హఠాత్తుగా కళ్లు తిరిగి అపస్మారకస్థితికి చేరుకుందన్నారు. 2022 నుంచి పూర్తిగా కాళ్లు చచ్చుబడిపోయాయని కన్నీళ్లు పెట్టుకుంది. దీంతో కలెక్టర్ ఓదార్చారు. దివ్యా ంగులైన ఇద్దరి బాలికలకు రెండు ట్రై సైకిళ్లు, వాకర్ అందజేస్తానని హామీ ఇచ్చారు.సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వచ్చి వాటిని తీసుకెళ్లాలని వారికి సూచించారు. అనంతరం చందం వెంకయ్యమ్మ అనే వృద్ధురాలికి పింఛను సొమ్ము అందజేసేందుకు కలెక్టర్ ఆమె ఇంటికి వెళ్లారు. మీరు ఎవరమ్మా అంటూ కలెక్టర్‌ను ఆ వృద్ధురాలు ప్రశ్నించారు. వెంటనే పక్కనే ఉన్న పంచాయతీ కార్యదర్శి రమణ కుమారి కలుగజేసుకొని ఈ మేడమ్ గారు కలెక్టర్ గారంటూ సమాధానం చెప్పారు. పింఛను డబ్బులు ఇవ్వడం కోసం ఇక్కడ వరకూ వచ్చారా మీరు చల్లంగ ఉండాలమ్మా అంటూ వృద్ధురాలు వెంకయ్యమ్మ కలెక్టర్‌ను దీవించింది.అనంతరం ఆమెతో కలెక్టర్ కాసేపు మాట్లాడారు. కలెక్టర్ ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా ఆ వృద్ధురాలు అనుసరించింది. వెంట రావొద్దని కలెక్టర్ వారించినా వస్తుండడంతో కలెక్టర్ ఆ వృద్ధురాలు చెయ్యి పట్టుకొని బయట వరకు నడిపించారు. ప్రతి వారం ఒక మండలంలో కలెక్టర్ పర్యటిస్తే బాధితులకు భరోసాగా ఉంటుంది.



వెంకయ్యమ్మ సమస్యలు వింటున్న కలెక్టర్



దుప్పలపూడిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, చినరాజప్ప, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నాయకులు యనమల, ఆకుల రామకృష్ణ

ఐదేళ్లలో పింఛన్లకే రూ.1,80,000 కోట్లు

మంత్రి నిమ్మల రామానాయుడు

అనపర్తి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఐదేళ్లలో కేవలం పింఛన్ల కోసమే రూ.1,80,000 కోట్లు ఖర్చు చేస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అనపర్తి మండలం దుప్పలపూడిలోని ఆర్వీఆర్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఎన్టీఆర్ స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి నెలా 1వ తేదీన పింఛన్ల పంపిణీ పండగ వాతావరణంలో జరుగుతుందన్నారు. రాష్ట్రంలో నూతనంగా 1.09 లక్షల మందికి స్పౌజ్ పింఛన్లు మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వం పెన్షన్ల పెంపు విషయంలో పేదలను మోసం చేస్తే కూటమి ప్రభుత్వం ముందు చెప్పిన విధంగానే పెన్షన్ రూ.4 వేలకు పెంచిందని గుర్తు చేశారు. అన్న క్యాంటీన్,తల్లికి వందనం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకాలు ఇప్పటికే అమలు చేశామని.. శనివారం అన్నదాన సుఖీభవ పథకం అమలు చేస్తున్నామన్నారు. 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం చట్టబద్ధంగా ప్రజాస్వామ్య రీతిలో పాలన చేస్తుందని ఎటువంటి కక్ష సాధింపులకు పాల్పడటం లేదన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలు మరో చాన్స్ ఇచ్చే అవకాశం లేదని తెలుసుకున్న జగన్ ఏమి చేస్తున్నాడో కూడా తెలుసుకోవడం లేదన్నారు. అనంతరం మంత్రి రామనాయుడు చేతుల మీదుగా 600 మంది లబ్ధిదారులకు స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేశారు.

ప్రజా సంక్షేమానికి ఎన్టీఆర్ కృషి

ప్రజా సం క్షేమం కోసమే చివరి వరకు పనిచేసిన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిరస్మరణీయులని జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శుక్రవారం దుప్పలపూడిలో ఎన్టీఆర్, మూలారెడ్డి విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం రామవరంలోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మూలారెడ్డి వర్ధంతి సభలో మంత్రి పాల్గొన్నారు. మూలారెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్తమ కవి, సాహితీవేత్త బేతవోలు రామబ్రహ్మం, మానసిక వైద్యుడు కర్రి రామారెడ్డిలకు మూలారెడ్డి పేరిట పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చినరాజప్ప, వేగుళ్ళ జోగేశ్వరరావు,యనమల రామకృష్ణుడు,రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి పాల్గొన్నారు.

ఏకగ్రీవం దిశగా కడియపులంక పంచాయతీ?

మేము.. ఎలా వెళ్లేది!

6

అటెన్షన్ ప్లీజ్..



డీఆర్ఎం సార్..

పుష్కరాలు దగ్గరపడుతున్నాయి.. అయినా సమస్యల స్టేషన్లు..ఎప్పటికి పరిష్కరిస్తారో ఏమి టో.. ఏళ్ల తరబడి సమస్యలు వెన్నాడుతున్నా పరిస్థితిలో మాత్రం మార్పులేదు.మరో రెండేళ్ల లో పుష్కరాలు రానున్నాయి. ఇప్పటికైనా రైల్వే అధికారులు దృష్టి సారిస్తే తప్ప పుష్కరాల నాటికి సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉండదు. పుష్కరాల పనుల కోటాలో రైల్వే డీఆర్ఎం వస్తున్నట్టు సమాచారం. డీఆర్ఎంగా చార్జి తీసుకున్నాక తొలిసారి ఇటు వైపు రావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

- ఎవరికీ పట్టని గోదావరి స్టేషన్
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- రాజమండ్రి రైల్వే స్టేషన్‌దీ ఇదే పరిస్థితి
- కొవ్వూరు, నిడదవోలులోను ఇక్కట్లే
- నేడు రైల్వే డీఆర్ఎం రాక

రాజమహేంద్రవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి, కొవ్వూరు, నిడదవోలు రైల్వే స్టేషన్లలో సమస్యలు తిష్టవేసుకుని ఉన్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. అయినా అధికారుల్లో మాత్రం కదలిక ఉండడంలేదు.కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.280 కోట్లతో రాజమహేంద్రవరంలో చేయాల్సిన రీమోడల్ పనులకు ఎప్పుడు కొబ్బరికాయ కొడతారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. విజయవాడ డివిజన్ రైల్వే మే నేజర్ మోహిత్ సోనాకియా శనివారం పర్యటన నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

నాలుగు జిల్లాలకు గేట్‌వే వంటి రాజమండ్రి రైల్వే స్టేషన్లో పరిశుభ్రత అంతంత మాత్రంగా ఉండగా, కుక్కలు స్వైర విహారం చేస్తుంటాయి. రాజమండ్రి, గోదావరి రైల్వే స్టేషన్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డంగా మారాయి. గోదావరి స్టేషను ముందూ వెనుకా భద్రతాపరమైన సమస్యలు ఉన్నాయి. అయినా నేటికీ ఎవరూ దృష్టి పెట్టడం లేదు. అవసరమైనంత పార్కింగ్ ప్రదేశం ఉంది. దీంతో ఈ స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టు కల్పించాలని జనం కోరుతున్నారు. నిడదవోలు రైల్వే బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతుండడంతో ఏడాదిగా జనం అవస్థలు అన్నీ ఇన్నీ కావు. నిడదవోలు స్టేషనులో సూపర్ ఫాస్టులు ఆగకపోవడంతో ఎంత అభివృద్ధి చేస్తే మాత్రం ఉపయోగం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. స్టేషనులో సదుపాయాల్లేవు. పేరుకు మాత్రమే జంక్షనే అయినా ప్రయాణికుల్లో ఎప్పుడూ టెన్షనే. ఎఫ్‌సీఐ గోదాముల ద్వారా గూడ్స్ రవాణా రూపంలో ఆదాయం భారీగా వస్తున్నా ఈ స్టేషనులో ఇబ్బందులకు పరిష్కారం దొరకడం లేదు.ఇక కొవ్వూరులో చాలా రైళ్ల హాల్ట్ లేక 100 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైలు వచ్చే ముందు డిస్‌ప్లే బోర్డులు పనిచేయడం లేదు. రైలు వచ్చే ఐదు నిమిషాల ముందు అవి వెలగడంతో ప్రయాణికులు ఉరుకులు పరు గులు పెడుతున్నారు. బాత్ రూమ్‌లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పరిశుభ్రత శూన్యంగా మారింది. రైల్వే డీఆర్ఎం ఆయా సమస్యలపై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డీఆర్ఎం పర్యటన ఇలా

డీఆర్ఎం మోహిత్ సోనాకియా ఉదయం 10.30 గం టలకు ప్రత్యేక సెలూన్(బోగీ)లో కొవ్వూరు చేరుకుని గంటపాటు పరిశీలిస్తారు. అక్కడి తనిఖీల అనంతరం కొవ్వూరులో పది నిమిషాలు,గోదావరి రైల్వే స్టేషనులో 15 నిమిషాలు, రాజమండ్రిలో 2 గంటలు తనిఖీలు నిర్వహిస్తారు.అనంతరం సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి కాకినాడ వెళతారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..పెద్ద రైల్వే స్టేషన్

రాజమండ్రి రైల్వే స్టేషనులోని భద్రతా విషయంలో తీవ్ర నిర్లిప్తత కనిపిస్తోంది. ముందస్తు రక్షణను విధికి వదిలేశారు. ప్రయాణికుల భద్రత రైల్వే స్టేషను లోపల ప్రభుత్వ రైల్వే పోలీసు(జీఆర్పీ), రైల్వే రక్షక దళం(ఆర్పీఎఫ్) పరిధిలోకి వస్తే.. ప్రాంగణంలో రెండో పట్టణ పోలీసులు చూసుకుంటారు. అయితే ఒకరు చూసుకుంటారని మరొకరు అనుకుంటూ ఉండడంతో ప్రయాణికుల రక్షణ రెండిటికీ చెడ్డ రేవడిలా మారింది. పోలీసులు ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ ఆటో బూత్ కరోనా విపత్తు సమయం నుంచి సేవలకు దూరమైంది. రైల్ కోచ్ రెస్టారెంట్, మూతబడిన ఐఆర్‌సీటీసీ ఆహారం ఫుడ్ ప్లాజాలు అసాంఘిక వ్యక్తులకు అడ్డాగా మారాయి. రైల్వే స్టేషన్‌లో ఐఆర్‌సీటీసీ 'ఆహారం' ఫుడ్ ప్లాజా ఆరు నెలల కిందట మూతబడి కంపు కొడుతోంది. పగిలిన అద్దాలు, ఊడిపోయిన స్విచ్ బోర్డులు, ధ్వంసమైన సీలింగ్.. ఇలా అపరి శుభ్రంగా ఉంది. ఈ ప్లాజా జీ+1 ఫ్లోర్లు ఉండగా.. మొదటి ఫ్లోరులో అసాంఘిక కార్యక లాపాలు జరుగుతున్న ఆనవాళ్లున్నాయి. ఇటీవల ఏలూరుకు చెందిన రామకృష్ణ అనే యాచకుడిపై పూటుగా మద్యం తాగి ఉన్న ముగ్గురు యువకులు దాడికి పాల్పడ్డారు. ఆ ముగ్గురు వ్యక్తుల్లో ఒకరి వద్ద గంజాయి ప్యాకెట్ ఉందని చెబుతున్నాడు. అంతకు ముందు ఇక్కడే చిన్న పిల్లతో యాచించుకొనే ఒక మహిళను పైఅంతస్తుకు తీసుకెళ్లినట్టు చెబుతున్నారు. దీనికి ఎదురుగా ఉన్న రైలు కోచ్ రెస్టారెంట్ వెనుక పట్టపగలే మద్యం సేవిస్తున్నారు. కోచ్ ప్రస్తుతం మూతబడినా.. దీనిని ఆనుకొని ఉన్న టీస్టాల్, రోజ్ మిల్క్, జ్యూస్ దుకాణాలు 24 గంటలూ తెరిచే ఉంటున్నాయి.దీంతో అర్ధరాత్రి వేళ మందు బాబులకు అడ్డాగా మారింది. రైల్వే ప్రాంగణంలో గొడవలు పరిపాటిగా మారిపోయాయి.ఆహారం ఫుడ్ ప్లాజాను ఆనుకొని 1,2,3,4 ప్లాట్‌ఫాంల నుంచి నేరుగా బయటకు వచ్చే మార్గం ఉంది. ఈ క్రమంలో రాత్రి వేళల్లో ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. రైల్వే స్టేషను నుంచి బయటికి వెళ్లే గేటు పక్కన 2017 మార్చి 29న అప్పటి ఎస్పీ బి.రాజకుమారి చొరవతో ప్రీపెయిడ్ ఆటో కం ఔట్‌పోస్ట్ ఏర్పాటైంది. రాత్రి వేళల్లో ఇది భరోసాగా ఉండేది.కరోనా విపత్తు సమయంలో మూతబడిన ఈ బూత్ మళ్లీ తెరుచుకోలేదు. ఇప్పటికైనా డీఆర్ఎం స్పందించి సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.





ఫుడ్ ప్లాజాలో రక్తపు మరకలు

దేవరపల్లి వెంకన్న ఆలయంలో పూజలు

దేవరపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా లలితా విష్ణుసహస్రనామ పారాయణం, గోవింద నామాలను మహిళా భక్తులు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక కుకుంమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, ఆలయ ఆలయ అర్చకులు కేశవచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు పాల్గొన్నారు.


విష్ణుసహస్ర నామ పారాయణం చేస్తున్న మహిళా భక్తులు

చిన కాశీ రేవుకు దారి మారింది..!


భక్తుల రాకపోకలకు మార్గం ఉంచిన అధికారులు, రైల్వే గోడను ఐరన్ గేటుతో మూసివేసిన దృశ్యం (ఇన్‌సెట్లో)

నిడదవోలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాశీరేవుకు వెళ్లేందుకు భక్తులు రైల్వే పట్టాలు దాటాల్సి ఉంటుంది. అయితే రైల్వే అధికారులు శుక్రవారం రైల్వే ట్రాక్‌పై నుంచి రాకపోకలు సాగించే వీల్లేకుండా రైల్వే గోడకు ఐరన్ గేటు బిగించేశారు. దీంతో సమాచారం అందుకున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోర్త ప్రమోద్ కుమార్, తదతరులు సంఘటనా స్థలానికి చేరుకుని రైల్వే అధికారులతో మాట్లాడుతూ ప్రత్యామ్నాయ మార్గం చూపించాలన్నారు. అప్పటి వరకు భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. దీనిపై రైల్వే అధికారులు స్పందించి కొంతమార్గం వదిలేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చామంతి భీమేశ్వరరావు, కొత్తలంక భగవాన్, కాసాని జ్ఞాన లహరి, మోర్త సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరికి కుంకుమ పూజలు

కొవ్వూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకుడు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో అమ్మవారిని విశేష అలంకరణ చేశారు. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే సంస్కృత పాఠశాల ప్రాంగణంలో వేంచేసియున్న లలితపార్వతీ అమ్మవారికి అర్చకులు మానేపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో మహిళలు పూజలు చేశారు.


కొలువై ఉన్న అమ్మవారు

జాతీయ తల్లిపాల వారోత్సవాలు


పీహెచ్‌సీలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న డాక్టర్ ప్రసాద్

పెరవలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ తల్లిపాల వారోత్సవాలను పెరవలి, కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రాజనాల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథులుగా సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, రాపాక సురేష్ పాల్గొని తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై.. గుంతలను పూడ్చరూ..!

- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

నిడదవోలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ప్రధాన మార్గంలోని విజ్జేశ్వరం సమీపంలో గల మలుపు వద్ద పెద్దపెద్ద గోతులు దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం గుండా ప్రతి నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో వాహనాలతో వేగంగా వెళుతున్నప్పుడు ఆ గోతుల్లో పడడంతో వాహనాన్ని నియంత్రించుకోలేక పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ప్రమాదకరమైన గోతుల వద్ద స్థానికులు ఏర్పాటు చేసిన ఎర్రజెండాలతో కాస్త వాహనదారులు ముందే మేల్కొంటున్నారు. ఇకనైనా సంబంధిత శాఖాధికారులు తక్షణమే స్పందించి పెను ప్రమాదాలు జరగకముందే ఈ గోతులకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


విజ్జేశ్వరం మలుపు వద్ద గుంతలు పడి ఉన్న రహదారి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పల్లంట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పల్లంట్ల, లక్ష్మీపురం గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు నిడదవోలు ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే

కొవ్వూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆరికిరేవుల, కుమారదేవంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి నియోజకవర్గ పర్యటనకు వచ్చినప్పుడు వికలాంగులకు రూ. 15 వేలు ఫించను మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. దీంతో సీఎం ఆదేశాల మేరకు కొవ్వూరు నియోజకవర్గంలో ఆగస్టు నుంచి తాళ్లపూడి మండలం గజ్జరానికి చెందిన పెంటా మధురిమ, ఆరికిరేవులలో మారిశెట్టి వెంకన్నకు, పశివేదలలో అలజింగి అరుణ మంచానికే పరిమితమై ఇతరులపై ఆధారపడడంతో వారికి హెల్త్ పింఛన్ రూ. 15 వేలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యనమదల శివరామకృష్ణ, గుత్తా రమణ, వరిగేటికాంతరాజు, వట్టికూటి వెంకటేశ్వరరావు, సూరపనేని చిన్ని, గారపాటి రామచంద్రరావు, గారపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ తుంపల్లి సింహాచలం, ఉండవల్లి గోపాల్, మద్దుకూరి వీవీ సత్యనారాయణ, జగన్మోహణరావు, మారిశెట్టి సత్యనారాయణ, మారిశెట్టి సతీష్, మల్లిన రవీంద్ర, పలగని బ్రహ్మాజీ, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ వీవీఎస్.చౌదరి, పంచాయతీ కార్యదర్శి పీబీఎస్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరుపట్టణంలోని 9వ వార్డులో ఆర్డీవో రాణీసుస్మిత సుధాపల్లి అప్పలరాజుకు రూ.15వేల పింఛన్‌ను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ఆరికిరేవులలో దివ్యాంగుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

అర్జీల పరిష్కారానికి చర్యలు

ప్రతి శుక్రవారం నియోజకవర్గ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలానికి కొత్తగా మంజూరైన స్పౌజ్, హెల్త్‌పెన్షన్లను గజ్జరంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛనుదారులకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చే విధంగా వాటిని పూర్తిస్థాయిలో అమలుచేసేందుకు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని దాని ఫలితంగానే పింఛన్ మొత్తాన్ని పెంచి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో భర్త చనిపోయిన భార్యలకు పింఛన్ మంజూరు చేయక మొండి చెయ్యి చూపించిందని, తమ ప్రభుత్వం రాగానే స్పౌజ్ పెన్షన్ రూ. 4000, హెల్త్‌పెన్షన్ 6 వేల నుంచి 15 వేల రూపాయలకు పెంచిందన్నారు. శుక్రవారం గజ్జరంలో పెంటా మధురిమకు హెల్త్ పింఛన్ రూ. 15 వేలు స్థానిక నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కాకర్ల వంశీ, కొర్లపాటి లక్ష్మణరావు, ఉప సర్పంచ్ దండమూడి శేషు, టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, బీజేపీ ఇందుగుల రామకృష్ణ తదితర కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే రావేరుపాడులో ప్రజలు అపరికర్మలు చేసుకోవడానికి మలకపల్లి సొసైటీ చైర్మన్ జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆర్థిక సహాయంతో భవనాన్ని కట్టించారు. దీన్ని శుక్రవారం ఆ గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో ప్రారంభించారు. కార్యక్రమంలో రేకపల్లి ముత్యాలరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రేకపల్లి మంగామణి, క్లస్టర్ సిద్దా దుర్గారావు, కోడి శంకరం, సిద్దా రామకృష్ణ, బొడపాటి గంగరాజు, రేకపల్లి వీర వెంకట్రావు, తిగిరిపల్లి గోపి, గాజుల శ్రీను, సచివాలయ సిబ్బంది కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయాలి

కొవ్వూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేరళకు చెందిన సిస్టర్ వందన ఫ్రాన్సిస్, సిస్టర్ ప్రీతి మేరీపై ఛత్తీస్‌ఘడ్ రైల్వే పోలీసులు పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. బలవంతంగా మత మార్పిడి, బాలిక అక్రమ రవాణా అంటూ తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తున్నామన్నారు.

భూ రీసర్వేకు సహకరించాలి : డీపీవో

చాగల్లు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేకు సహకరించాలని డీపీవో శాంతమణి అన్నారు. గ్రామకంఠం భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు రీసర్వేను శుక్రవారం అధికారికంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రోన్ కెమెరాల సహాయంతో జరిగే సర్వేకు సహకరించాలని ప్రభుత్వ భూములు గుర్తించడం, లబ్ధిదారులకు న్యాయం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్. శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, టీడీపీ నేతలు కరుటూరి సతీష్, సర్పంచ్ మన శ్యాంతి, పంచాయతీ కార్యదర్శి మొహ్మద్ ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత గంగరాజు మృతి

- పలువురి నేతల సంతాపం

గోపాలపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత దాత మద్దిపాటి వెంకట్రాజు (58) శుక్రవారం మృతి చెందారు. ఆయన ఓటుహక్కు వచ్చినప్పటి నుంచి టీడీపీలోనే కొనసాగుతూ ... పార్టీలో కీలక పాత్ర పోషించారు. ఇటీవలే గ్రామాభివృద్ధి కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. అందులో ఎస్సీ శ్మశానవాటికలో తాగునీటి బోరు, ప్రయాణికులకు విశ్రాంతిభవనంతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, గ్రామంలో రెండుచోట్ల ప్రయాణికులు సేద తీరడానికి రేకులషెడ్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేశారు. గంగరాజు అకాల మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షుడు కొర్లపాటి రాము, మద్దిపాటి సతీష్, రమేశ్, కొడవటి సత్యనారాయణ, జ్యేష్ట శ్రీధర్, భూరెడ్డి శ్రీనివాస్, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

చాగల్లు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు అందజేస్తుందని ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి అన్నారు. చాగల్లులో శుక్రవారం కొత్తంగా మంజూరైన స్పౌజ్ పెన్షన్లను టీడీపీ నేతల చేతుల మీదుగా అందజేశారు. మండలం మొత్తం 137 మందికి మంజూరయ్యాయి. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జొన్నకూటి సుబ్బారావు, తహశీల్దార్ ఎం. మెరికమ్మ, ఎంపీడీవో ఆర్. శ్రీదేవి పాల్గొన్నారు.

పెరవలి: మండలంలో సాధారణ పింఛన్లతో పాటు కొత్తగా మంజూరైన 165 స్పౌజ్ పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. అజ్జరంలో పది, అన్నవరప్పాడు పది, కాకరపర్రు 15, కానూరు 13, కానూరు అగ్రహారం 7, కాపవరం 7, ఖండవల్లి 20, మల్లేశ్వరంలో 6, ముక్కామలలో 17, నడిపల్లిలో 8, పెరవలి 7, పిట్టలవేమవరం 19, తీపర్రు 6, ఉసులుమర్రులో 7 మంజూరయ్యాయి.


చాగల్లులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, తదితరులు

దేవరపల్లి: మండలంలో 194 వితంతు పింఛన్లకు గాను రూ. 77 లక్షల 6 వేలు అందజేసినట్టు ఎంపీడీవో రాజారావు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధుల పింఛన్లతో కొత్తగా మంజూరైన వాటిని ఆయా లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఉప్పులూరి రాంబాబు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని మొదటిరోజు 92.89 శాతం పూర్తి చేసినట్టు ఎంపీడీవో జీ.రాజమనోహర్ తెలిపారు. గోపాలపురంలో శుక్రవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి రాము, గ్రామ కమిటీ అధ్యక్షుడు భూరెడ్డి శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ కూనపం ప్రసాద్‌బాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీనివాస్, జ్యేష్ట శ్రీధర్, కొడవటి చిన వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అనురాధ, ఉండవల్లి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కాకినాడలో అట్టహాసంగా 'హాకీ' చాంపియన్‌షిప్ పోటీలు


ధ్యాన్‌చంద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హాకీ ఇండియా జూనియర్ మహిళల 15వ జాతీయ చాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ జి.బిందుమాధవ్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి ముఖ్య అతిథులుగా, జేసీ రాహుల్ మీనా, ఏఎస్పీ మనీష్ దేవ రాజ్ పాటిల్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డీ ఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డి, హాకీట్రిపుల్ ఒలింపియన్ ఆశాంత్ర లాక్ర, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత సత్య గీత, హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బి.చాణుక్యరాజు, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అతిథులుగా హాజరయ్యారు. తొలుత జిల్లా క్రీడా మైదానంలోని హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్సీలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 18 జట్లతో మార్చ్ ఫాస్ట్, నరేడ్ నిర్వహించారు.

పింఛన్ల సొమ్ము దుర్వినియోగం

- ఐదుగురు సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ

ప్రత్తిపాడు, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్ము రూ.14 లక్షలు దుర్వినియోగం చేశారు. మూడేళ్లగా లబ్ధిదారులకు చెల్లించకుండా మిగిలిన సొమ్మును ఖజానాకు జమ చేయకుండా వ్యక్తిగత అవసరాల కోసం వినియోగించారు. దీంతో ఈ వ్యవహారంపై ప్రత్తిపాడు ఎంపీడీవో ఐదుగురు సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరాలివి కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో పింఛన్ల నిమిత్తం 11,539 మందికి రూ.5,05,47500 నెలవారీ ఖర్చు చేస్తున్నారు. అయితే ప్రతి నెలా పలు కారణాల వల్ల కొంత సొమ్ము సచివాలయ సిబ్బంది వద్ద నిలిచిపోతుంది. 2021 నుంచి 2024 మధ్యలో ఈ విధంగా రూ.30 లక్షల వరకు మిగిలిన సొమ్ములు సచివాలయ ఉద్యోగుల వద్దే ఉండిపోయాయి. వీటిని వెనువెంటనే స్థానిక ఖజానా కార్యాలయంలో జమచేయాల్సి ఉన్నప్పటికీ నిబంధనలు పట్టించుకోకుండా సొంత అవసరాలకు వాడుకోవడం విషయం బయటకు పొక్కింది. ఈ క్రమంలో రూ.16 లక్షల వరకు గతంలో ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు రికవరీ చేసి ఖజానాకు జమ చేయించారు. అయితే ఇంకా రూ.14లక్షల వరకు సచివాలయ ఉద్యోగుల వద్ద ఉండిపోవడంతో ఎంపీడీవో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేర కు ఐదుగురు సచివాలయ ఉద్యోగులకు నోటీసులు జారీచేశారు. వీటిలో గోకవరం పంచాయతీకి చెందిన రూ.2,03,250, చినశంకర్లపూడికి చెందిన రూ.7,46,250, గజ్జనపూడికి చెందిన రూ.45వేలు, ధర్మవరానికి చెందిన రూ.1,90,250, ఒమ్మంగి పంచాయతీకి చెందిన రూ.3.75లక్షలు పింఛన్ల పంపిణీ సొమ్ము తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమ చేయాల్సి ఉంది. దీంతో నిధులు దుర్వినియోగం చేసినట్టు భావించి ఐదుగురు సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులను ఎంపీడీవో జారీచేశారు. 24 గంటలోపు రూ.14 లక్షలు ఖజానాకు జమ చేసి రసీదును ఎంపీడీవో ఆఫీసులో అందజేయాలనిఆదేశించారు.

ఏకగ్రీవం దిశగా
కడియపులంక సర్పంచ్ ఎన్నిక ?

- గడువు ముగిసే సమయానికి మూడు నామినేషన్లు రాక

కడియం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కడియపులంక సర్పంచ్ ఉపఎన్నిక దాదాపు ఏకగ్రీవం కానుంది. దివంగత సర్పంచ్ మార్గాని అమ్మాజీ గుండెపోటుతో మృతి చెందారు. ఆ స్థానం ఖాళీ అవ్వడంతో ఆమె కుమార్తె మాదిశెట్టి పద్మావతి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

అయితే నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన మొదటి రోజు ఓ నామినేషన్, శుక్రవారం మరో నామినేషన్ రాగా, రెండో రోజు పద్మావతి బంధువు మార్గాని సత్యవేణి మరో నామినేషన్ దాఖలు చేశారు. దీంతో మాదిశెట్టి పద్మావతి, మార్గాని సత్యవేణి మాత్రమే నామినేషన్లు వేశారు. నామినేషన్ల పరిశీలన, అభ్యంతరాలు, నామినేషన్ల ఉపసంహరణ సమయానికి మార్గాని సత్యవేణి తన నామినేషన్ ఉపసంహరించుకునే అవకాశాలు ఉండగా, మాదిశెట్టి పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మాదిశెట్టి పద్మావతి రెండు నామినేషన్లు, మార్గాని సత్యవేణి ఓ నామినేషన్ వేశారని, దీంతో నామినేషన్లు ముగిసే సమయానికి ఇద్దరు అభ్యర్థులు, మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయని స్టేజ్-1 రిటర్నింగ్ అధికారి మణికుమార్ తెలిపారు.

మెము.. ఎలా వెళ్లేది !

- పేరుకే ఫాస్ట్ ప్యాసింజర్ ప్రయాణం ... నడిచేది మాత్రం చాలా నెమ్మదే
- అపరిశుభ్రంగా టాయిలెట్లు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

నిడదవోలు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఈ రైలు కోసం ప్రతి రోజూ వెయ్యి కళ్లతో ఎదురు చూస్తారు. అరగంట ఆలస్య మైందంటే ఒకటే టెన్షన్.. ఎక్కేవారు.. దిగేవారితో నిత్యం రద్దీగా నే ఉంటుంది.. అయినా ఆ రైలుపై ఎందుకో రైల్వే శాఖకు చిన్న చూపు.. సమస్యలు పట్టించుకోరు.. చెప్పినా వినిపించు కోరు.. చేసేది లేక అంత డిమాండ్ ఉన్న రైలులో నిత్యం ముక్కుతూ మూలుగుతూ ప్రయాణం చేస్తున్న వారి సంఖ్య వేలల్లో ఉంటు ంది. నిత్యం కాకినాడ పోర్టు నుంచి విజయవాడకు, తిరిగి సా యంత్రం విజయవాడ నుంచి కాకినాడ పోర్టుకు చేరుకుంటుంది. ఈ రైలులో ఉద్యోగులు, ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లే వారు ఎందరో రాకపోకలు సాగిస్తుంటారు. వేరే ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుం టున్నవారు అక్కడ పనిచేసే ప్రాంతాల్లో ఇళ్ల అద్దెలు భరించలేక, కుటుంబాలను, ఉన్న ఊరిని మార్చలేక ఇలా ఎన్నో కారణాలతో ఈ ఫాస్ట్ పాసింజర్ రైలులో ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చేందుకే మక్కువ చూపుతున్నారు.






యువర్ అటెన్షన్ ప్లీజ్.. ఈ ట్రైన్ పేరు విజయవాడ మేము. కానీ ఉభయ గోదావరి జిల్లాలో ఇది ఎంతో మందికి ఫాస్ట్ ప్యాసింజర్ రైలుగానే తెలుసు. కొవిడ్‌కు ముందు ఫాస్ట్ ప్యాసింజర్‌గా తిరిగిన రైలు కొవిడ్ తరువాత ఎక్స్‌ప్రెస్ పేరుతో తిరుగుతోంది. కానీ జర్నీ మాత్రం ప్యాసింజరే. చార్జీలు మాత్రం పెరిగాయి.. దీంతో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు.

కొవిడ్‌కు ముందు 16 బోగీలతో పాస్ట్ పాసింజర్‌గా రాకపోకలు సాగించే ఈ రైలు కొవిడ్ తరువాత ఎనిమిది బోగీలతో ఎక్స్‌ప్రెస్ చార్జీలను వసూలు చేస్తోంది. ఇలా రైలులో మూడే టాయ్‌లెట్స్ ఉండడంతో ప్రయాణికులు నరక యాతన అనుభవిస్తున్నారు. పోనీ అవి కూడా అత్యంత దారుణంగా ఉంటున్నాయని ప్రయాణికులు హడలి పోతున్నారు. రైల్వే శాఖకు ఎంతో ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న పాస్ట్ పాసింజర్ రైలులో బోగీలను పెంచి చార్జీలను తగ్గించి పరిశుభ్రతకు ప్రాధాన్యతకు ఇవ్వాలని రైల్వే అధికారులను కోరుతున్నారు.



ఎక్స్‌ప్రెస్ పేరుతో అధిక చార్జీలు

- వెంకటేశ్వరరావు, రైల్వే ప్రయాణికుడు



నిత్యం రైలులో నిడదవోలు నుంచి విజయవాడకు తిరిగి నిడదవోలుకు రాకపోకలు సాగిస్తుంటా. ఈ ఫాస్ట్ ప్యాసింజర్ రైలుకు ఎక్స్‌ప్రెస్ పేరుతో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. రైలులో టాయిలెట్లు ఏమాత్రం శుభ్రంగా లేవు. రైల్వే అధికారులు ప్రయాణికులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదు.

బోగి కూడా పెంచరు

- సురేష్, నిడదవోలు ఫాస్ట్ ప్యాసింజర్ రైలు ప్రయాణికుడు



ఈ రైలు ప్రయాణిల్లో నేను ఒకడిని. కొవిడ్‌కు ముందు 16 బోగీలతో ఉండే రైలు తరువాత ఎనిమిది బోగీలకు పరిమితమైంది. ఎప్పుడు రద్దీగా ఉండే రైలుకు కనీసం ఒక బోగి కూడా పెంచరు. ఎక్స్‌ప్రెస్ పేరుతో టికెట్‌కు అధిక ధరలు వసూలు చేస్తున్నా .. ప్రయాణించేందు మేము పాసింజర్ రైలే.